ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 10 నవంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## మునుపెన్నడు లేనంతగా.. రికార్డుస్థాయిలో వాహన విక్రయాలు

**పండుగ సీజన్‌లో 52 లక్షల యూనిట్ల అమ్మకాలు**

**న్యూఢిల్లీ :** వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. ఈ పండుగ సీజన్‌లో మునుపెన్నడు లేనంతగా 52 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. 42 రోజుల పాటు సాగిన పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో వాహనాలు అమ్ముడయ్యాయయని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం ఫాడా తాజాగా వెల్లడించింది. వీటిలో ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అత్యధికంగా ఉన్నాయని తెలిపింది. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతోపాటు ఆదాయ పన్నులో సంస్కరణలు


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news


# 2034 వరకూ కాంగ్రెస్సే



- జూబ్లీహిల్స్ ఓటర్లకు కేసీఆర్ ఎందుకు విజ్ఞప్తి చేయలేదు?
- దీన్ని బట్టి కేటీఆర్, హరీశ్‌పై ఆయన ఆలోచనను అర్థం చేసుకోవచ్చు
- ధృతరాష్ట్రుడిలా దుర్మార్గాల్ని భరిస్తున్నరు.. పార్టీ కూలుతుంటే కుమిలిపోతున్నరు
- బీఆర్ఎస్ వ్యాలిడిటీ అయిపోయింది
- ఈసారి ఎన్నికలు 2029 జూన్‌లో.. 2034 వరకూ కాంగ్రెస్సే అధికారంలో..
- రానున్న పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసి చూపిస్తాం
- కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్నీ ఆపలే.. గుజరాత్‌కు గులాముగా కిషన్‌రెడ్డి

హైదరాబాద్

బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందన్నారు. ఇదేమీ తాను రాజకీయ విమర్శ కోసం చెబుతున్నది కాదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఇక్కడ లేకుండా పోయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ పని అయిపోతుందన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన బయటికి రావడంలేదని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటేయాలని నియోజకవర్గ ప్రజలకు ఈనాటి వరకూ కేసీఆర్ విజ్ఞప్తి చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "బయటికి వచ్చి ప్రచారం చేయడానికి ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. కానీ, పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కూడా విజ్ఞప్తి చేయడంలేదంటే కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకున్న ఆలోచనేంటో అర్థం చేసుకోవచ్చు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన కళ్లముందు పార్టీ కూలిపోతుంటే కుమిలిపోతున్నారని, దుఃఖం, ఆవేదనతో కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో - మిగతా2లో



## ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో విజయం మాదే!

- దేశాన్ని విభజించడానికి యత్నిస్తున్న బీజేపీ, ఆరెస్సెస్: రాహుల్
- మోదీ, షా ఎక్కడికెళ్లినా 'ఓట్ల చోరీ'పై దొరికిపోతారని వ్యాఖ్య
- సాత్పురా టైగర్ రిజర్వులో రాహుల్ సఫారీ.. బీజేపీ విమర్శలు
- శిక్షణ శిబిరానికి ఆలస్యంగా రాహుల్.. శిక్షగా పది బస్కీలు



## ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలి

- శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం ధామి
- ఇతర రాష్ట్రాలకు మోదీ సూచన
- యూసీసీని అమలు చేస్తోందని, మత మార్పిడులు అడ్డుకుంటోందని ప్రశంసలు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న మోదీ

## న్యాయ సహాయం నైతిక బాధ్యత

- లాయర్లతో కలిసి వాకథాన్‌లో పాల్గొన్న జస్టిస్ బీఆర్ గవాయ్
- కక్షిదారుల పట్ల సేవా దృక్పథంతో మెలగాలి

2



## అభివృద్ధి, సంక్షేమం చూసి మాకు ఓటెయ్యండి

- వివిధ పథకాలకు రూ.1.06 లక్షల కోట్లు వెచ్చించాం
- "పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి సర్కారు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు.
- జూబ్లీహిల్స్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్

రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసి జూబ్లీహిల్స్ ఓటర్లంతా కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. గత ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీల మేరకు ఉచితబస్సు, 200 యూనిట్ల విద్యుత్, గ్యాస్ రాయితీ వంటి సంక్షేమ పథకాల అమలుకు రెండేళ్లలో 1.06 లక్షల కోట్లు వెచ్చించామని తెలిపారు. యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రులు - మిగతా2లో

## పాతబస్తీలో డ్రగ్స్ రాకెట్ ఆగడాలు



- మజ్లిస్ పార్టీ అండదండలతో హిందూ అమ్మాయిలపై దురాగతాలు
- వారిని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం
- ప్రభుత్వం సరైన విధంగా స్పందించకుంటే కేంద్ర బలగాలు దింపుతాం
- మీడియా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్

పాతబస్తీలో మజ్లిస్ పార్టీ అండతో డ్రగ్స్ రాకెట్ హిందూ బాలికలను లక్ష్యంగా చేసుకొని కిడ్నాప్, అత్యాచారాలు చేస్తూ వాళ్ల జీవితాలను నాశనం చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ విషయంలో పాతబస్తీ పోలీసులు కనీస విచారణ జరపడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయం తెలిసినా మజ్లిస్ పార్టీ ఒత్తిళ్లతో చూసీ - మిగతా2లో

## మళ్లీ అణు సైరన్!

- ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి తరహాలో మళ్లీ అణ్వాయుధాల పోటీ
- ఉక్రెయిన్ వేదికగా అగ్ర రాజ్యాల పోరు
- అణుశక్తితో నడిచే క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించిన రష్యా
- అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు ట్రంప్ ప్రకటన.. అణ్వస్త్రాల పెంపులో చైనా

3లో

## కేసీఆర్ బాటలోనే రేవంత్

- ఇళ్లు ఆశ చూపి ఓట్లు వేయించుకోవడం అలవాటైంది
- జూబ్లీహిల్స్‌లో మజ్లిస్ నేతల దాదాగిరీ నడుస్తోంది: కిషన్‌రెడ్డి
- ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ఎందుకు జరగలేదు?
- ఈ వెనకబాటుకు కారణం ఎవరు?
- గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనికి బాధ్యులు కావా?



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పాదయాత్ర చేసి వివిధ కాలనీల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెబితే, రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు అంటున్నారు. ఇద్దరూ మోసం చేస్తున్నారు. ఇండ్లు ఆశ చూపి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మరచిపోవడం అలవాటైంది ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ఎందుకు జరగలేదు? ఈ వెనకబాటుకు కారణం ఎవరు? గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనికి బాధ్యులు కావా? ఆ పార్టీల నిర్లక్ష్యం వల్లే ప్రజలకు ఈ దుస్థితి పట్టింది'అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. 'మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులు దాదాగిరి చేస్తున్నా రు. దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. భవిష్యత్తులో వీరి ఆగడాలు మరింత పెరిగే అవకాశం ఉంది. మన బిడ్డలను మనం రక్షించుకోవాలన్నా, మనకు రక్షణ కావాలన్నా, నియోజక వర్గం బాగుపడాలన్నా బీజేపీని - మిగతా2లో

## బిహార్ ప్రచారానికి తెర



- ఈ నెల 11న రెండో దశ పోలింగ్
- తొలి దశ రికార్డు స్థాయి పోలింగ్‌తో అంచనాలు తారుమారు
- తమకే అనుకూలం అంటూ అధికార, విపక్షాల ధీమా
- అసెంబ్లీ ఎన్నికలపై మరింత పెరిగిన ఉత్కంఠ

3లో

# బోరుపట్ల అపటోరియా పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 9:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరుపట్ల గ్రామంలో గల ఎపిటోరియ యూనిట్ వన్ పరిశ్రమలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కెమికల్ ట్యాంక్ పేలి మంటలు చెలరేగినట్లు విశ్వాసనీయ సమాచారం దీనికి పరిశ్రమ యజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా వ్యవహరించడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. భద్రత లోపాల కారణంగానే మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో గతంలో కూడా అనేక పరిశ్రమల్లో పేలుడు సంభవించాయి. ఎస్బి ఆర్గానిక్స్ కంపెనీలో గతంలో బాయిలర్ పేలి భారీగానే ప్రాణ నష్టం జరిగింది. కోలెంట్ పరిశ్రమలో ఏ ఎన్ ఎఫ్ డి సెంటర్ ఫేజులో మంటలు వచ్చి కార్మికులు చనిపోయిన ఘటన విధితమే అయినా కూడా యజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చాలామంది ప్రాణాష్టం జరిగిన ప్రభుత్వం గానీ ప్రభుత్వ అధికారులు గానీ వీరిపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని ప్రజల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# కోడంగల్ ప్రభుత్వ హాస్పిటల్, హాస్టళ్లలో దోబీ పోస్టులు రిక్రూట్మెంట్ చేయాలన్న గోపి రజక

అధునాతన దోబీ ఘాట్ ను నిర్మించాలన్న అశోక్

నిరుపేద రజక కుటుంబాలకు ఇందిరమ్మ

ఇళ్లు మంజూరు చేయాలి వెంకటయ్య

**కోడంగల్, నవంబర్ 09( ప్రభాత సూర్య ):** కోడంగల్ పట్టణ కేంద్రంలో అధునాతనమైన హంగులతో ప్రభుత్వ హాస్పిటల్ , గురుకుల పాఠశాలలు ఇంజనీరింగ్ కళాశాల మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక. వికారాబాద్ జిల్లా కోడంగల్ పట్టణంలో ఆదివారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వికారాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్ , జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 220 పడకల ఆసుపత్రితో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గారు ఇప్పుడు ఉన్న ధోబీలతో పాటు నూతన దోబి పోస్టులు రిక్రూట్మెంట్ చేయాలని అదేవిధంగా ఆధునాతన దోబీ ఘాట్ కోసం ఎకర భూమి కేటాయించి ఉతికే కాంట్రాక్టు రజకులకు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి గారిని కోరారు. త్వరలో దోబీ కాంట్రాక్టు, దోబీ ఉద్యోగుల రిక్రూట్మెంట్ , ఆధునాతన దోబీ ఘాట్ కోసం ముఖ్యమంత్రిని కలుసి సమగ్రమైన సమాచారాన్ని వారికి అందిస్తామని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి. అశోక్ అన్నారు. కోడంగల్ నియోజకవర్గంలో చాలా మంది రజక కులస్తులు నిరుపేదలు ఉన్నారని వారికి జీవనోపాధి లేక మహానగరాలకు వలసపోతున్నారు అలాంటి వారిని గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని



సీఎంను జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలప్ప , దౌల్తాబాద్ వెంకటయ్య, జిల్లా నాయకులు సుందరప్ప,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అన్నారం వెంకటేష్, జిల్లా యూత్ నాయకులు గొటికె నాగేష్,బొంరస్ పేట్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మండల నాయకులు టెంట్ శ్రీనివాస్,చిన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు

# వన భోజనాలతో ఐక్యత, స్నేహభావం..

కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్....

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :కార్తీక మాస వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. బీహెచ్ఈఎల్ ప్రభుత్వ కాలేజీ ఆవరణలో తెలంగాణ శ్రీ వాసవి ఆర్యవైశ్య ఐక్యవేదిక వారు మరియు బీహెచ్ఈఎల్ ఓబీసీ అసోసియేషన్ ఆఫీస్ వద్ద గోకుల్ కల్చరల్ మరియు వెల్ఫేర్ అసోసియేషన్ యాదవ సంఘం మరియు వివిధ సామజిక వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు టీజి భరత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వనభోజనాల కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఒకే చోట చేరి సామూహిక భోజనాలు చేయడం అభినందనీయమన్నారు. చెట్ల నీడలో భోజనం చేయడం ద్వారా ప్రకృతితో మనకున్న బంధాన్ని గుర్తు చేసుకుంటామని అన్నారు. బంధువులు, స్నేహితులు సంఘ సభ్యుల మధ్య ఐక్యత సంతోషాన్ని కాపాడుకోవడం అలాగే పిల్లలకు సంస్కృతిని పరిచయం చేసే గొప్ప సాంప్రదాయం కలిగిన పండుగ కార్తీక మాస వనభోజనాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజీరా గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల యోగానంద్, సురేష్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు రఘునాథ్



రెడ్డి, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, నటరాజ్, మల్లేష్, శ్రీనివాస్, సత్యం, వినయ్, పలువురు ప్రముఖులు, తెలంగాణ శ్రీ వాసవి ఆర్యవైశ్య ఐక్యవేదిక మరియు గోకుల్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ బిహెచ్ఇఎల్ యాదవ సంఘం సభ్యులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ను వెంటనే సమావేశపరచాలి

"శ్రమశక్తి నీతి - 2025" ను ఉపసంహరించుకోవాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

పటాన్ చెరువులో సిఐటియు ఆధ్వర్యంలో సెమినార్

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 9 :** ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఐఎల్సిని వెంటనే సమావేశపరచాలని, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి 2025 నూతన లేబర్ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు పటాన్చెరువు ఐలా భవన్ లో సిఐటియు ఆధ్వర్యంలో " కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ (శ్రమశక్తి నీతి - 2025) - కార్మిక వర్గం పై దాడి" అంశంపై జరిగిన సెమినార్ కు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పాల్గొని ప్రసంగించారు.. కేంద్ర బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన లేబర్ కోడ్స్ ను అమలు చేసేందుకే నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి - 2025 ను తెస్తుందని అన్నారు. ఇది పూర్తిగా కార్మిక వర్గానికి వ్యతిరేకమైందని, శ్రమశక్తి నీతి - 2025 నూతన లేబర్ పాలసీని తేవడం అంటే కార్మిక వర్గం మీద దాడి చేయడమే అని అన్నారు. కార్మిక చట్టాలు ఉన్నప్పుడే అమలు కాకుండా ఉల్లంఘన జరుగుతున్నాయని అన్నారు. శ్రమ శక్తి నీతి - 2025 పేరు గొప్పగా ఉంది తప్ప దాని పాలసీ మాత్రం కార్మికుల హక్కులను లేకుండా చేసి కట్టు బానిసలుగా మార్చేదిగా ఉందని అన్నారు. 26 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందని అన్నారు. లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా సిఐటియు దేశంలోని కార్మిక సంఘాలన్నిటిని ఏకం చేసి దేశవ్యాప్త సమ్మె చేయడంతో అమలు చేయకుండా వెనకడుగు వేసిందని అన్నారు. దేశంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం తప్ప అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతున్నాయని అన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ ను కేరళ రాష్ట్రంలో అమలు చేయమని అక్కడి వామపక్ష ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు.శ్రమ శక్తి నీతి లేబర్ పాలసీని మనుస్మృతి పద్ధతిలో రాజ్యాంగం పక్కన పెట్టడమే అన్నారు. ఇది సామాజిక న్యాయానికి ప్రజాస్వామానికి దెబ్బతీస్తుందని అన్నారు. వివక్ష అసమానతలను పెంచి పోషిస్తదని అన్నారు. ప్రమాదకరమైన, కార్మిక వ్యతిరేకమైన నూతన లేబర్ పాలసీ శ్రమ శక్తి నీతి



2025 ను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ను వెంటనే సమావేశ పర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి -2025 నూతన లేబర్ పాలసీని కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు కే. రాజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ కిర్బియూనియన్ జనరల్ సెక్రెటరీ వివిఎస్ రాజు, యూనియన్ నాయకులు మల్లేష్, లఖన్ ,తలారి శ్రీనివాస్, శ్యాంబాబు,రాజిరెడ్డి,బిలాల్,జైపాల్ మహేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విలేఖరి పై దాడి చేసిన 8 మంది అరెస్ట్

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 9:** శనివారం ఉదయం 3 గంటల ప్రాంతంలో కబ్జా భూమి వార్త కవర్ చేశాడన్న అక్కసుతో రిపోర్టర్ విఠల్ అనే విలేఖరి పై దాడి చేసిన 8 మందిని అరెస్ట్ చేసినట్టు అమీన్పూర్ సిఐ కె. నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొడవలో పాల్గొన్న మధు అలియాస్ మధుసూదన్, వంశీ, నల్లమల శివ ప్రసాద్, యుగేందర్, కొత్త సంపత్, కుంచాల బ్రహ్మయ్య, సల్లడి హరీష్, కోడూరి స్వరాజ్ లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సిఐ కె. నరేష్ పేర్కొన్నారు. ఈ ఘటనలో స్థానిక తహశీల్దార్ పై కూడ దాడి జరిగినట్టు తెలిసింది.



## కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి కిషన్


21 మందితో నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ గా మండల సత్యనారాయణ ఎన్నిక



**ప్రభాత సూర్య, నవంబర్ 09, తుర్కయంజాల్:** ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి కిషన్ డిమాండ్ చేశారు.ఆదివారం తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం జరిగింది. అనంతరం 21మందితో నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. తుర్కయంజాల్ మున్సిపల్ సీఐటీయూ కన్వీనర్ మండల సత్యనారాయణ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10, 11వ తేదీల్లో హైదరాబాద్ కాటేదాన్ ప్రాంతంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సీఐటీయూ జిల్లా మహాసభల్లో అధిక సంఖ్యలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాలాద్రి, జంగయ్య,రాములు,కొండిగారి శంకర్, మధు,మహమ్మద్ జాఫర్, మాధవ రెడ్డి,నాగం ధర్మ రెడ్డి, శ్రీనివాస్, దానయ్య, గోపాల్, కృష్ణ, నరసింహ, ప్రేమలత, స్వప్న, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు.....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నల్గొండ నుండి విచ్చేసి కూచిపూడి నాట్య గురువులు శ్రీమతి కళ్యాణి చంద్రశేఖర్ శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. మూషిక వాహన, జయ జనార్ధన, పుష్పాంజలి, విగ్నేశ్వర ప్రార్థన, అయిగిరి నందిని, తరిత ఝేమ్, శ్రీమనారాయణ, సతులారా,సీతాకల్యాణ, శ్రీ విఘ్నరాజాం భజే, తిల్లాన, శివ శివ, నారాయణతే, శివతాండవం అంశాలను కళాకారులూ మోక్షిత, మన్యశ్రీ, లక్ష్మి ప్రసన్న, గుణశ్రీ,ఆరాధ్య, వర్షిక,హంవీక, సహస్ర, మహిమాన్విత, నిలేశా, ఉజ్వల లు ప్రదర్శించి మెప్పించారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికలలో ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ గెలుపు లాంఛనమే..




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** వికారాబాద్ జిల్లా బీసీ కులాల బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు శంకర్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో పరిగి నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సహప్రచారం చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి ప్రముఖ బీసీ నాయకుడు బి.సిబిడ్డ ను ఆశీర్వదించి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారంలో పాల్గొని ఓటర్ల కి విజ్ఞప్తి చేస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శంకర్ యాదవ్, జింకల యాదయ్య యాదవ్, పాండు ముదిరాజ్, అర్.కె సాయన్న ముదిరాజ్, బండి రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, కృష్ణ పద్మశాలి బిసి నాయకులు పాల్గొన్నారు...

## బ్యాట్ తో బాది భార్యను హత్య చేసిన భర్త

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 9:** భార్య పై అనుమానంతో భర్త భార్యను హత్య చేసిన సంఘటన అమీన్పూర్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది . పట్టణంలోని కేఎస్ఆర్ కాలనీ లో నివాసముండే భార్యాభర్తలు కృష్ణవేణి బ్రహ్మయ్య గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. భార్య కృష్ణవేణి కోహిర్ డీసీసీబీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా



పనిచేస్తుంది. గత కొంతకాలంగా బ్రహ్మయ్య భార్య కృష్ణవేణి పై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ విషయమే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో బ్యాట్ తో కృష్ణవేణి పై దాడి చేసి హత్య చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు అమీన్పూర్ సిఐ కె.నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పేద ప్రజల కష్టాలను తీర్చడమే ఈ ఎల్ వి ఫౌండేషన్ లక్ష్యం

గంజాయి కి బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని
గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టిస్తే పదివేల రూపాయల బహుమతి
ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్





**సంస్థాన్ నారాయణపూర్, నవంబర్ 09( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జైహిందు ఫంక్షన్ హాల్ లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసే క్రమంలో ముందుగా స్థానిక చౌరస్తాలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం ప్రాచీన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరువాత సమావేశం వద్దకు చేరుకున్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా విచ్చేసినటువంటి యువత, ఫౌండేషన్ సభ్యులు ఘనంగా ఇ ఎల్ వి భాస్కర్ కు ఘన స్వాగతం పలికి వేదిక మీదకు ఆహ్వానించారు. ఆత్మీయ సమ్మేళన ఉద్దేశించి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డా. ఇ ఎల్ వి భాస్కర్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజల కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో చేపట్టబోతున్నామని తెలిపారు. యువత తమ కాళ్లపై తము నిలబడే విధంగా స్వయం ఉపాధిలో రాణించేందుకు చేయూతనిస్తానన్నారు. విద్య, వైద్యం ,ఉపాధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. నిరుపేద కుటుంబాల బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని. మరి ముఖ్యంగా వైద్య విషయంలో కూడా పూర్తిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ముఖ్యంగా నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి కి బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టిస్తే పదివేల రూపాయల బహుమతి అందజేస్తానని అన్నారు. మహిళలు స్వయం ఉపాధిలో రాణించేందుకు అవసరమైన శిక్షణ, కుట్టు మిషన్ల ద్వారా జీవనోపాధి కల్పించి ఆర్థికంగా వారి కుటుంబాలు బలపడేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని గట్టుప్పల్ మండలంలో గోవుల సంరక్షణ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. పేద ప్రజల ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సహాయం నిరంతరం అందిస్తానని అన్నారు. ఇ ఎల్ వి ఫౌండేషన్ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు, యువత, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కోతుల సమస్య నుండి గ్రామస్తులను కాపాడండి

ఇ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ కు వినతి.



**సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 09( ప్రభాస్ సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జైహింద్ ఫంక్షన్ హాల్ లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ యువతతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇ ఎల్ వి భాస్కర్ ని, గ్రామానికి చెందిన బీసీ మేధావుల సంఘం రాష్ట్ర నాయకులు శికిలమెట్ల వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా విద్య, వైద్యం, ఉపాధి అనే అంశం మీద అనేక రోజులుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇ ఎల్ వి ఫౌండేషన్ సేవలను అభినందిస్తూ చైర్మన్ భాస్కర్ కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేసిన అనంతరం.. నారాయణపురం మండల కేంద్రంలో గత కొంతకాలంగా కోతుల బెడద వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిల్లలు ,మహిళలు, వికలాంగులు, వృద్ధులు, బయట తిరిగే పరిస్థితులు లేవని, కోతులు గుంపులు గుంపులుగా ఇండ్ల మీదకు చొరబడి గ్రామస్తులపై దాడులు సైతం చేస్తున్న విషయాన్ని వారు వివరించి. ఇ ఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో వదిలివేయాలని గ్రామస్తుల పక్షాన విజ్ఞప్తి చేస్తూ, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మీరు మంచి మనసుతో ఇట్టి విజ్ఞప్తిని స్వీకరించి మా గ్రామ ప్రజలను కోతుల బెడద నుంచి కాపాడుతారని విశ్వసిస్తూ మనవి చేయడం జరిగింది. ఇ ఎల్ వి భాస్కర్ సానుకూలంగా స్పందించి ఇట్టి తీవ్రమైన సమస్యను సంబంధిత అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఇ ఎల్ వి బాస్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా కోతులను పట్టించి,వాటిని దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలేసి త్వరలోనే మీ సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని కోతుల సమస్యలను ఇ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డా.ఇ ఎల్.వి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లి, కోతుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నందుకు గ్రామస్తులు శికిలమెట్ల వెంకటేశ్వర్ల ను అభినందిస్తూ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్



**గండిపేట్, :సూర్య ప్రతినిధి** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు తథ్యమని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆదివారం మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పట్లోళ్ల కార్తిక్ రెడ్డిల ఆదేశాల మేరకు సోమాజిగూడ డివిజన్ పరిధిలో ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. రోడ్ షో ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలను కలిసి కరపత్రాలు పంచి కారు గుర్తుకు వేటు వేయాలని కోరామన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నోముల రాము యాదవ్, కొంపల్లి జగదీష్ నేత, ఈర్లపల్లి ప్రవీణ్, గంజి రాజు నేత, జె.సునీల్, సరిత మహేష్ నేత, ప్రదీప్, చిన్న తదితరులు పాల్గొన్నారు......

# మానవత్వమా, నీ అస్థిత్వం ఎక్కడ





స్వార్థపు చట్రంలో చిక్కుకున్న నేటి సమాజం మనుషుల్లో కనుమరుగవుతున్న మానవత్వం.

**సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 09( ప్రభాత సూర్య):** సృష్టిలో మానవ జన్మకు అత్యున్నత స్థానం కల్పించింది 'మానవత్వం', ఆలోచించగలిగే జ్ఞానం, నిర్ణయాలు తీసుకునే శక్తి, ప్రేమించే హృదయం, విచక్షణ ఇవన్నీ మనిషిని ఇతర జీవుల కంటే గొప్పగా నిలబెట్టాయి. కానీ నేడు అదే మానవత్వం కనుమరుగైపోతున్న దశకు చేరుకోవడం విచారకరం. మనిషి మనసును స్వార్థం ఆక్రమించింది. మానవ విలువలు పడిపోతున్నాయి. సంస్కారం కనిపించట్లేదు, హృదయం లేని వ్యక్తులు పెరుగుతున్నారు. ప్రతి రోజు మనం వినే, చూసే అనేక ఘటనలు మనలో మానవత్వం చనిపోతుందనే వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. లి ఆర్థిక సంబంధాలుగా మారిన కుటుంబ బంధాలులి ఒకప్పుడు కుటుంబం అంటే ప్రేమ, అనుబంధం, కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు అండగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ కుటుంబాలే డబ్బు, ఆస్తి, హక్కుల లెక్కలతో చిన్నాభిన్నం అవుతున్నాయి. ఇటీవల సిద్ధిపేట జిల్లాలో జరిగిన సంఘటన దీనికి పరాకాష్ట. తండ్రి మరణించినా, ఆస్తి వివాదాల కారణంగా కన్న కొడుకులు అంత్యక్రియలకు కూడా రాకపోవడం మనుషుల్లో క్షీణిస్తున్న మానవత్వానికి నిదర్శనం. ఇలాంటివి నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. తల్లిదండ్రులు భారమని భావించే ఈ కాలంలో, వారి పింఛన్ లేదా ఆస్తిని మాత్రం తమ హక్కుగా కోరే పిల్లలు పెరిగిపోతున్నారు. తమ జీవితాలను త్యాగం చేసిన తల్లిదండ్రులు ఆశ్రమాల్లో, రోడ్లపై అనాథలుగా మిగిలిపోవడం మన సమాజపు విలువలు ఎంతగా దిగజారాయో తెలియజేస్తుంది. సాంకేతికత వివేకాన్ని దూరం చేసింది! సాంకేతికత ప్రపంచాన్ని దగ్గర చేసింది, కానీ మనుషులను, వారి హృదయాలను దూరం చేసింది. తమ చుట్టూ ఏదైనా ప్రమాదం జరిగితే, గాయపడిన వ్యక్తి చావు బతుకుల్లో వున్నా కాపాడటానికి ముందుకొచ్చే చేతుల కంటే, వీడియోలు తీసే మొబైల్ ఫోన్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇటీవల ఇటువంటి దృశ్యాలు చాలా పెరిగాయి. 'మానవత్వం' ఇప్పుడు 'వైరల్ వీడియో' కింద మారిపోయింది. సున్నితమైన హృదయం తెర వెనుక దాక్కుంది. మనిషి జ్ఞానంలో ఎదిగాడు, కానీ విలువల్లో దిగజారిపోయాడు. మృతదేహానికి కూడా చోటు లేని ఇల్లు ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రమాదేవి ఘటన ప్రతి ఒక్కరి మనసును కలిచివేసింది. రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌గా పనిచేసిన ఆ మహిళ చివరి కోరిక, తన సొంత ఇంట్లో నుండే తన అంత్యక్రియలు జరగాలని. కానీ ఆమె కోడలు తలుపులు మూసేసి, ఆ మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వలేదు. ఈ సంఘటన మనుషులు ఎంత క్రూరంగా తయారవుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇది మన సమాజపు హృదయంలో పుట్టిన 'మానసిక దారిద్ర్యానికి' అద్దం పడుతోంది. మనసున్న మనిషిగా బతకడం నేర్చుకోవాలి! మానవత్వం ఎక్కడో దొరకదు. అది మనిషి మనసులోనే ఉంటుంది. కానీ స్వార్థంతో మన కళ్ళు మూసుకుని, మనసును కఠినంగా మార్చుకుంటున్నాం. పిల్లలకు ఆస్తి విలువ కాదు, బంధాల విలువ నేర్పించాలి. విద్య జ్ఞానంతో పాటు మానవ విలువలు కూడా బోధించాలి. ప్రమాదం జరిగినప్పుడు వీడియో తీయడం కాదు, మానవత్వంతో స్పందించడం నేర్చుకోవాలి. చిన్నప్పుడు తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక ఏడ్చిన పిల్లలు, పెద్దయ్యాక వారినే భారం అనుకోవడం ఎంత మాత్రం సరికాదు. మన ఎదుగుదలకు తమ జీవితాలను త్యాగం చేసిన వారిని బాధ్యతగా చూసుకోవడం, వారికి ఎల్లవేళలా అండగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవత్వం మరిచిన మనిషి ఈ ప్రపంచానికే ప్రమాదం. కేవలం 'మనిషిగా' బతకడం కాదు, మనసున్న మనిషిగా బతకడం నేర్చుకుందాం... జి. అజయ్ కుమార్ సామాజిక విశ్లేషకులు

# బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ జేఏసీ



**నల్గొండ నవంబర్ 9 ప్రభాత సూర్య** బీసీలకు విద్య ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని టీఎన్జీవో భవన్లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు సంబంధించిన నాయకులు పాల్గొనడం జరిగింది. అన్ని కుల సంఘాల నాయకులు బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ ని జిల్లా జేఏసీ చైర్మన్ గా ఆమోదం తెలిపి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలని కుల సంఘాల నాయకులందరూ తీర్మానించడం జరిగింది. సోమవారం నుండి బీసీ రిజర్వేషన్ల కోసం జిల్లా వ్యాప్తంగా బీసీ లందరూ ఉద్యమించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. డిసెంబర్ ఫస్ట్ నుంచి నిర్వహించే పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లు కోసం ప్రతిపక్షాలు మరియు అధికారపక్షం పార్లమెంట్లో చర్చించి బీసీ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. బీసీ బిల్లు పెట్టాల్సినటువంటి ప్రధానమంత్రి మౌనం విడాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం ఇస్తే మా బీసీలం సపోర్ట్ చేశామని అదేవిధంగా మా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకి 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఈ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు కల్పించేదాకా ఈ రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంటోజు వెంకటాచారి,రజక సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక రాజు చెన్నయ్య, మున్నూరు కాపు సంఘం వైద్యుల సత్యనారాయణ ,పాల్వాయి రవి, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్ గౌడ్, పద్మశాలి సంఘం కర్నాటి యాదగిరి, యాదవ సంఘం చెన్నూరి భరద్వాజ యాదవ్, మేరు సంఘం నవీన్ కుమార్, ముదిరాజ్ సంఘం దుడ్డు కృష్ణమూర్తి, బెస్త సంఘం అంబటి శివకుమార్, మైనార్టీ నాయకులు ఖదీర్, వివిధ కుల సంఘాల నాయకులు పందుల సైదులు గౌడ్, గండిచెరువు వెంకన్న గౌడ్, అయితగోని జనార్దన్ గౌడ్, పుట్ట వెంకన్న గౌడ్ ,మార్గం సతీష్ కుమార్, ఖమ్మంపాటి శంకర్ దుర్గ, గడగోజు విజయ్ చారి, చెన్నోజు రాజు, మచ్చ గిరి, అనంత నాగరాజ్ గౌడ్, తలారి యాదగిరి, అంజయ్య, సత్యనారాయణ, నరసింహ, జీవన్ బాబు, యోగానంద రావు, వి అంజయ్య, వి వెంకటరమణ ,పి రవి రాజు, ఈ సైదులు, సతీష్ యాదవ్, సందీప్, రాజశేఖర్, ఆంజనేయులు, గడ్డం శంకరయ్య, మేడి కిరణ్, గణేష్ రవికుమార్, పాల్గొన్నారు.ల

## చర్లపల్లి లో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఏఎస్పీ జి. రమేష్




**నల్గొండ నవంబర్ 9 ప్రభాత సూర్య** చర్లపల్లి లో మేడి నరసింహ దొడ్డ యలమంద జ్ఞాపకార్థం యశోద మలక్పేట వారి సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని నల్లగొండ ఎడిషనల్ ఏఎస్పి ప్రారంభించి మాట్లాడారు పేద ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న సందర్భంలో యశోద హాస్పిటల్ వారు క్యాంపు నిర్వహించడం అభినందనయం పేద ప్రజలు నేడు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సందర్భంలో ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ క్యాంపు మేడి శంకర్ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగినది ఈ కార్యక్రమంలో నల్లగొండ రూరల్ ఎస్సై సైదా బాబు, డాక్టర్ పుల్లారావు, సత్యవతి హాస్పిటల్ యజమాన్యం డాక్టర్ రామ్ మనోహర్, డాక్టర్ సంపద, శ్రీ సాయి తేజ క్లినిక్ డయాగ్నొస్టిక్ సెంటర్ వీరస్వామి, యశోద హాస్పిటల్ ఇన్చార్జ్ శ్రీధర్, శ్రీ నేత్ర కంటి హాస్పిటల్ హైదరాబాద్ యజమాన్యం, లయన్స్ క్లబ్ కె.వి ప్రసాద్, డాక్టర్ పి ఝాన్సీ రాణి, కోట సరిత,పిచ్చయ్య గౌడ్, కరుణాదేవి, సత్తిరెడ్డి, సాధిక్ పాషా చర్లపల్లి గ్రామ ప్రజలు మందడి మధు సుధన్ రెడ్డి, పెరిక నాగరాజు, నాగిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న కలప వ్యాపారం

నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ వదిలేస్తున్న అధికారులు



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 9 :**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పల్లెలో,పట్టణాలలో చెట్లు నాటాలని కోట్ల రూపాయల నిధులు వెచ్చించి చెట్లను నాటితే కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా వాటిని నరికి డబ్బులు సొమ్ముచేసుకుంటున్న అధికారులు మాత్రం మాకు మముల్లె ముఖ్యం అని అక్రమార్కుల వద్ద సెటిల్మె ట్ దందా కొనసాగిస్తున్నారు. ఆదివారంనాడు నాడు సదాశివపేట మండలం మద్దికుంట గ్రామ సమీపంలో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికి తీసుకెళ్తున్నారన్న స్థానికుల సమాచారం ఇచ్చిన వెంటనే వెళ్లి ఆ వాహనని తనిఖీ చేయకుండా అక్రమార్కుల వద్ద సెటిల్మెంట్ చేసుకొని వద్ధిలిపెట్టి అమాయకంగా వెళ్లిపోయారు.ఇలాంటి అధికారులు ఉండటం వలన రోజురోజుకు అక్రమార్కులు పెరిగిపోయి అడవిని మొత్తం దోచుకున్నటున్నారు. చెట్లను నరికె అక్రమార్కులకు ఉచిత సలహాలు అధికారులే ఇచ్చి వాహనాలను దొడ్డి దారిన పంపిస్తూ మాకేం తెలియనట్టు వ్యవరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రింది స్థాయి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 9:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం బస్వాపూర్ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నరేష్ రాజ్ రోహిత్ విల్లు స్వామి , సుధాకర్ కన్నె స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం స్థానిక గురు స్వాములు వెంకట్ గౌడ్, తలారి మల్లేష్ చేతుల మీదుగా నిర్వహించారు. అయ్యప్పకు పంచామృత అభిషేకాలు, అష్టోత్తర నామాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తి గీతాలు భజన కీర్తనలు ఆలకిస్తూ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలోవెంకట్ గౌడ్ గురు స్వామితలారి మల్లేష్ గురు స్వామి, రాజేష్ గురుస్వామి, నిత్యాన్నదాన ప్రభు ఆగం రవీందర్ గౌడ్ గురుస్వామి, లక్ష్మణ్ గురు స్వామి,మంగళపర్తి శ్రీనివాస్ గురుస్వామి, అల్లిపూర్ ప్రభాకర్ గురుస్వామి, శ్రీనివాస్ యాదవ్ స్వామి,రవితేజ ,పరమేశ్వర ,నరేష్ సింగ్,సదాశివ,నిరంజన్,రాజు ,సాయిగౌడ్ ,భాను,అంకిత్,నవీన్,సుధాకర్ ,పిట్ల ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం అనేది సామాన్యులకు ఒక వజ్రాయుధం లాంటిది

రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం వెంకట మధు




**నల్గొండ నవంబర్ 9 ప్రభాత సూర్య** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులైన డాక్టర్ చంటి ముదిరాజ్ కు, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్ కు, రాష్ట్ర అధ్యక్షులైన సూర స్రవంతి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నల్లగొండ జిల్లా పక్షాన చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ లో కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంచడం జరిగినది. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఇకముందు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ఎన్నో విజయాలు సాధించాలని, మరెన్నో వసంతాలు జరుపుకోవాలని సామాన్యునికి సమాచారం అందజేయడంలో ఎప్పుడు మనం ముందుంటావని, సామాన్య ప్రజలకు ఇది వజ్రయించడం లాంటిదని తెలియజేయడం జరిగింది. మన సంస్థ రాష్ట్రంలో ప్రధానంగా ఉచిత విద్య, వైద్యం ఎజెండానే ధ్యేయంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం వెంకట మధు, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధం వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు బైరు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రిక అధినేత మాకం గంగాధర్ నేత జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలియజేసిన క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ పంతం వెంకటేశ్వర్లు





**కూకట్ పల్లి, నవంబర్ 09 (ప్రభాత సూర్య) :** క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రిక అధినేత, సిఎండి మాకం గంగాధర్ నేత జన్మదిన వేడుకలు గాజులరామారం డివిజన్ పరిధిలోని శుభమస్తు బంకెట్ హాల్ లో క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రిక రిపోర్టర్ పంతం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా పంతం వెంకటేశ్వర్లు ఆయనను కలసి పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ప్రజాపక్ష జర్నలిజం పతంలో నిరంతర యోధుడిగా నిలవాలని, మీ కలం ఎప్పటికీ కదిలే కత్తిలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్, రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బీ రోడ్లకు మోక్షం

**కైలాస్‌నగర్:** హ్యామ్ ప్రాజెక్ట్ కింద పది ఎంపిక ? రూ.114కోట్ల నిధులు మంజూరు ? రాష్ట్ర స్థాయిలోనే టెండర్ల ప్రక్రియ ? పాత జాతీయ రహదారి 7 నుంచి వాంకిడి, మహబూబ్‌ఘాట్ వరకు 10.20 కిలో మీటర్ల డబుల్ లేన్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ? ఆదిలాబాద్ నుంచి కెరమెరి వరకు 41.25 కిలో మీటర్ల రోడ్డు మంజూరు కాగా, ఇందులో 4.65 కిలో మీటర్ల వరకు సింగిల్ లేన్, 36.6 కిలో మీటర్లు డబుల్‌లేన్ నిర్మించనున్నారు. ? జైనథ్ మండలం కాప్రి ఎక్స్ రోడ్డు నుంచి ఆనంద్‌పూర్, కూర గ్రామం వరకు 25 కిలో మీటర్ల రోడ్డు పనులు చేపట్టనుండగా, ఇందులో 5.22 కిలో మీటర్లు సింగిల్ లేన్, 19.78 కిలో మీటర్లు డబుల్ లేన్ నిర్మాణం చేపట్టనున్నారు. ? ఆదిలాబాద్ నుంచి కెరమెరి రోడ్డు 42కిలో మీటర్ల దూరం నుంచి 55.6 కిలోమీటర్ల వరకు 13.60 కి లో మీటర్ల వరకు రోడ్డు మంజూరు కాగా, ఇందులో 10.06 కిలో మీటర్లు సింగిల్ లేన్, మరో మూ డు కిలోమీటర్లు డబుల్‌లేన్ నిర్మించనున్నారు, ? ఇచ్చోడ నుంచి మాన్కాపూర్, నర్సాపూర్, చించోలి, జామిడి గ్రామాల మీదుగా సిరిచల్మ వరకు 16కిలో మీటర్ల వరకు సింగిల్ లేన్ నిర్మాణం చేపట్టనున్నారు. ? గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వరకు 35.06 కిలో మీటర్ల వరకు డబుల్‌లేన్ నిర్మించనున్నారు. ? ఉట్నూర్ నుంచి ఇంథన్‌పల్లి మధ్యలో 35.6 నుంచి 37.60 కిలో మీటర్ల వరకు రెండు కిలోమీటర్లు డబుల్‌లేన్ నిర్మాణం చేపట్టనున్నారు. ? ఆదిలాబాద్ నుంచి రాంపూర్, పొన్నారి, ఖోడద్, హస్నాపూర్, సుంకిడి, లక్ష్మింపూర్ గ్రామాల మీదుగా తలైగూడ వరకు 23.30 కిలో మీటర్ల వరకు డబుల్‌లేన్ నిర్మించనున్నారు. ? ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు ఎనిమిది కిలో మీటర్ల వరకు డబుల్‌లేన్ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ప్రాజెక్ట్ కింద జిల్లాలోని 10 రోడ్లను ఎంపిక చేసింది. 174.95 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణాల కోసం రూ.114 కోట్లు మంజూరు చేసింది. పనులు త్వరగా ప్రారంభమైతే రోడ్ల రూపురేఖలు మారి ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

### తొలగనున్న ఇబ్బందులు

అధ్వాన రహదారులపై దృష్టి సారించిన ప్రభుత్వం ఎట్టకేలకు వీటి నిర్మాణాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. హ్యామ్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాంట్రాక్టర్లకు మోబలైజేషన్ అడ్వాన్స్ కింద 10శాతం నిధులు ముందుగానే ఇవ్వనుంది. మరో 30శాతం 30 నెలల్లో వాయిదా పద్ధతుల్లో చెల్లించేందుకు యోచిస్తోంది. మిగతా 60 శాతం నిధులను కాంట్రాక్టర్లు సొంతంగా వెచ్చించాల్సి ఉంటుంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లే 15ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు తీసుకునేలా నిబంధనలున్నాయి.

### త్వరలో టెండర్లు పిలిచే అవకాశం

జిల్లాలో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనుల టెండర్ ప్రక్రియ హైదరాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర కార్యాలయం ద్వారానే ఆన్‌లైన్‌లో చేపట్టి కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తారు. ఉన్నతాధికారులు త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశముంది.

# కర్షకుల కన్నీటి గోస

**కుమ్రం ఆసిఫాబాద్ :** అకాల వర్షాలు జిల్లా రైతులను నిలువునా ముంచాయి. పంట చేతికొచ్చే దశలో పూర్తిగా దెబ్బతినగా, కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. కొందరు తీవ్ర వేదనతో పత్తి చెట్లు పీకేసి నిప్పు పెడుతుండగా, మరి కొందరు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళనకు గురి చేస్తున్నది. నష్టపోయిన అన్నదాతలకు పరిహారమిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించి మూడు నెలలు దాటినా, రూపాయి మంజూరు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎకరానికి మూడు నాలుగు క్వింటాళ్లే..

జిల్లాలో ఈ ఏడాది 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలతో ఒక్కో ఎరకానికి రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు ఖర్చుచేశారు. కనీసం ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే లాభాల మాటెలా ఉన్నా, కనీసం పెట్టిన పెట్టుడులు చేతికి వచ్చి నష్టం రాకుండా ఉండే అవకాశముంటుంది. కానీ, పత్తి పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. గతంలో ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది కనీసం 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇక ఉన్న పత్తినైనా ఏరుదాం అనుకుంటే.. ఒక్కో కూలీ కిలోకు రూ. 10 నుంచి రూ. 12 దాకా తీసుకుంటున్నారు. వచ్చే ఆదాయం కంటే కూలీల ఖర్చే అధికమవుతోంది. దీంతో పత్తి ఏరుకునే బదులు వదిలేయడమే మంచిదని చెట్లను పీకేసీ తగులబెడుతున్నారు.

### మనస్తాపం చెంది పత్తికి నిప్పు..



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన గుర్లె మల్లేశ్ రెండెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కౌలుకు రూ. 24 వేలు. పంట పెట్టుబడికి రూ. 50 వేల ఖర్చు అయింది. ఇటీవల మొంథా తుపాన్‌తో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ. 6 వేల చొప్పున 6 క్వింటాళ్ల పత్తి అమ్మితే రూ. 36 వేలు వచ్చాయి. ఈ లెక్కన రైతు కష్టం పోను తిరిగి రూ. 38 వేల అప్పు మిగిలింది. చేనులో మిగిలిపోయిన పత్తిని తీసేందుకు కిలోకు రూ. 12 ఖర్చు అవుతుండడంతో మరింత నష్టం వస్తుందని భావించాడు. తీవ్ర ఆవేదనతో శుక్రవారం పత్తి చెట్లను తీసి కుప్ప పెట్టి నిప్పు పెట్టాడు.

### ఇప్పటికే ఇద్దరు రైతుల ఆత్మహత్య

పంట దిగుబడి రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జిల్లాలో ఇప్పటికే ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాంకిడి మండలం మండోకర్ వాడకు చెందిన బెట్లె సుధాకర్ (34) ఈ నెల ఒకటిన పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రైతు 9 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. భారీ వర్షాలతో పంట దెబ్బతినగా, దిగుబడి వచ్చే అవకాశం లేక మనస్తాపం చెంది ఆత్యహత్యకు పాల్పడ్డాడు. ఇక సిర్పూర్-టీ మండం చింతకుంట గ్రామానికి చెందిన పట్టల కిష్టయ్య (62) గత నెల 31న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన తనకున్న 4 ఎకరాల్లో పత్తి సాగుచేశాడు. అధిక వర్షాలతో దిగుబడి వచ్చే అవకాశం లేకపోవడంతో తీవ్ర వేదనకు గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మరణించాడు.

## నోరు అదుపులో పెట్టకపోతే తాటతీసాం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ ప్రెసిడెంట్ గోదా పాండుయాదవ

కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిపై అనుచిత వాఖ్యను ఖండించిన బీజేపీ శ్రేణులు

09గండిపేట01



**గండిపేట: సూర్య ప్రతినిధి** నోరు అదుపులో పెట్టకపోతే తాటతీస్తాం, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిపై అనుచిత వాక్యాలు చేసిన బీఆర్ఎస్ పార్టీ తొత్తులపై డివిజన్ నాయకులు ఆగ్రహం తెలిపారు. మొన్న కార్తీక్‌రెడ్డి మాట్లాడింది చూస్తే మరి అదే విధంగా వెంకటేష్ మాట్లాడింది చూస్తే అర్థం అవుతుంది మీకు మీ పార్టీ నాయకులకు ఎంత సంస్కారం ఉందో అన్నారు. మీ భాషా మీ సంస్కారం చూసే ప్రజలు మీ ప్రభుత్వాన్ని బొంద పెట్టారన్నారు. మొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడింది చూడండి ఎంత గౌరవంగా మాట్లాడారో మీ కార్తీక్‌రెడ్డి ఏమో ఎంపీని ఎం పీకిన్నావ్ అంటాడు నువ్వు ఏమో మా కార్పొరేటర్‌ను బచ్చ అంటావ్ ఇదే నా మీ సంస్కారం అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ ఆలా మాట్లాడినందుకే ప్రజలు మీకు ఈ గతి పట్టించారని మర్చిపోకండి అన్నారు. కార్పొరేటర్ బచ్చ అంటున్నావ్ కదా ఎప్పుడు వచ్చిండు అని కాదు బుల్లెట్ దిగిందా లేదా అనేది చూసుకోవాలన్నారు. వెంకటేష్ నీ స్థాయి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదు గుర్తుపెట్టుకో అన్నారు. శ్రీనివాస్‌రెడ్డిని నువ్వు అనే బచ్చనే 10 సంవత్సరాల్లో నాలుగు ఎలక్షన్‌లలో కోట్లాడి రెండుసార్లు కార్పొరేటర్ గెలిచి ఈ రోజు ప్రాంతానికి ఎంతో అభివృద్ధి చేసిన వ్యక్తి అన్నారు. మొన్న కూడా బీజేపీ లాంటి అతిపెద్ద నేషనల్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. నువ్వు శ్రీశైలంరెడ్డి అన్నా రాజకీయం గురించి మాట్లాడే స్థాయి నీది అసలే కాదు బిడ్డ. శ్రీశైలం అన్నా రాజకీయం చేసినప్పుడు నువ్వు ఒక్క బచ్చగనివి అని మర్చిపోకు అన్నారు. వాస్తవాలు తెలిస్తే తట్టుకోలేవు మొన్నటి దాకా ప్రకాష్‌గౌడ్ కింద బానిస బతుకు బాధకిన్నావ్ ఆయన నిన్ను నీ బస్తీలో ఉన్న కొంత మందికి పక్కన పెట్టుకుంటే ఉన్న ఓట్లు పోతున్నాయి అని నిన్ను పక్కకి తంతే నువ్వు ఇదే కార్పొరేటర్ దగ్గరకి బీజేపీలో చేరే ప్రయత్నం చేస్తే మేము నిన్ను దెక్కకపోతే నువ్వుపోయి కార్తీక్‌రెడ్డినీ పట్టుకున్నావు అని అందరికి తెలుసు అన్నారు. నీ పార్టీలో నీ నిన్ను అధ్యక్షులుగా ఎవ్వడు దెక్కలేదు నువ్వూ ఎంత ట్రై చేసిన కార్పొరేటర్ మీద ఏదో మాట్లాడితే నువ్వు ఏదో అయ్యిపోతావు అని కల్లలు కంటున్నావన్నారు. అది సాధ్యం కాదు అని గుర్తుపెట్టుకో మరోసారి మాట్లాడినప్పుడు బిడ్డ జాగ్రత్తగా మాట్లాడు లేకపోతే నీ చరిత్ర మొత్తం బయటపెడ్తాం అన్నారు. తస్మాత్ జాగ్రత్త అదే విధంగా నీ స్థాయి మా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి గురించి విమర్శించే స్థాయి మాట్లాడే స్థాయి నీది కాదు అన్నారు. మరోసారి ఎంపీ, కార్పొరేటర్‌పై విమర్శిస్తే డివిజన్ ప్రజల ఆగ్రహానికి ఆహుతి కావాల్సి వస్తుందని తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, మన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్, మధుసూధన్‌రెడ్డి, ఎల్.వి.రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు......

# శుభ్రత.. రక్షణ

**నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు విద్యాశాఖ 'క్లీన్ అండ్ సేఫ్ – 5.0' పేరిట కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా పాఠశాలల ప్రాంగణాలు, తరగతి, వంట గదులు, టాయిలెట్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపడుతారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా చేపట్టే ఈ పనులను డిసెంబర్ 5వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో జిల్లాలోని 1,600 ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకు విద్యాశాఖాధికారులు ప్రణాళిక రూపొందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, ఎస్ఎంసీల బాధ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దాతలనే కాక స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నారు.

ఏమేం చేస్తారంటే...

ప్రతీ పాఠశాలలను శుభ్రంగా, ఆకర్షణీయంగానే కాక సురక్షితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో క్యాంపెయిన్ రూపొందించారు. తొలుత పాత, ప్రమాదకర నిర్మాణాలను గుర్తించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఆపై తరగతి గదులు, ల్యాబ్‌లు, కార్యాలయ గదులు, సెప్టిక్ ట్యాంకులు, టాయిలెట్లు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయిస్తారు. అంతేకాక పాత ఫర్నిచర్, పాడైన వస్తువులు, ప్లాస్టిక్, మెటల్ వ్యర్థాలను వేరు చేయాలి. ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలి. ఎట్టి పరిస్థితుల్లో దహనం చేయొద్దనే నిబంధన విధించారు. అంతేకాక మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులు చేతులు కడుక్కునేలా అవగాహన కల్పిస్తారు. అలాగే, చెదలు, దోమలు లేకుండా చూ స్తూ నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలు నాటాలి. పాఠశాల గోడలపై ఆరోగ్య సందేశాలు రాయిస్తారు.

### భద్రత కోసం...

పాఠశాలల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ప్రమాదాల బారిన పడకుండా ఈ క్యాంపెయిన్‌లో పనులు చేపడుతారు. విద్యుత్ వైర్లు, స్విచ్‌లను తనిఖీ చేసి దెబ్బ తింటే మార్పిస్తారు. అలాగే, బెంచీలు, టేబుళ్లు, బోర్డులు కూడా పకడ్బందీగా బిగిస్తారు. ఇక విద్యార్థులు వంట గదుల్లోకి రాకుండా పర్యవేక్షించాలి. ఆపై ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను తనిఖీ చేసి లోపాలు ఉంటే సరిచేయించాలి. ఈ పనులు పూర్తయ్యాక ఆస్పత్రి, అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖ ఉద్యోగుల ఫోన్ నంబర్లు గోడలపై రాయిస్తారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలను సురక్షితంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా క్యాంపెయిన్ నిర్వహిస్తాం. తద్వారా ఆరోగ్యకరమైన, అభ్యసన వాతావరణం ఏర్పడుతుంది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా చేపట్టే ఈ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నాం.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ వాలీబాల్ పోటీలకు జట్ల ఎంపిక

**కాసిపేట :** మంచిర్యాల జిల్లా సోమగూడెం భరత్ కాలనీలోని శిశు మందిర్ క్రీడా మైదానంలో ఆదివారం వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ వాలీబాల్ బాల బాలికల జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు భైరగోని సిద్దయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, స్థానిక నాయకులు ముత్తె భూమయ్య వాలీ బాల్ సర్వీసింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్ర స్థాయి జట్టులో హైదరాబాద్ మేడ్చల్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి జట్టు క్రీడాల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం గోపాల్, పొన్నాల కనక రాజు, అజ్మీర శ్రీనివాస్, డైకిన్ ఏసీ కంపెనీ ప్రతినిధి రమేష్, వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రావుల రామ్మోహన్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి గాజుల శ్రీమాన్, కొయ్యాడ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు విజయ్, రాజేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# 2034 వరకూ కాంగ్రెస్సే

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆత్మహత్య చేసుకుని మరీ బీజేపీకి అవయవదానం చేసిందని ఆరోపించారు. దాంతో బీజేపీ గెలుచుకున్న 8 సీట్లే మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయన్నారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ మొదలైందంటూ కేసీఆర్ కూతురు కవితే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు.

**సీబీఐ కాళ్లకు బంధం వేసిందెవరు?**

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా ఇంతవరకు విచారణ ప్రారంభం కాలేదని, సీబీఐ కాళ్లకు బంధం వేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. అలాగే ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకూ గవర్నర్ నుంచి అనుమతి రాలేదన్నారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ అవమానించారని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించలేని కేటీఆర్.. ప్రజల అభిమానం ఎలా చూరగొంటారని ప్రశ్నించారు. కేసీఆర్ ధృతరాష్ట్రుడిలాగా పిల్లల దుర్మార్గాలను భరిస్తున్నారని వ్యాఖ్యానించారు. తనది కార్యకర్త మనస్తత్వమని, హుజూరాబాద్, హుజూర్‌నగర్, సాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ కంటే ఎక్కువగా ప్రచారం చేశానని తెలిపారు. 2034 జూన్ వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, దీనిని రాసిపెట్టుకోవచ్చని ప్రకటించారు. రాబోయేవి జమిలి ఎన్నికలు అని, 2028 డిసెంబరుకు బదులుగా.. 2029 జూన్‌లో జరుగుతాయని అన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించి 2034 జూన్ వరకూ అధికారంలో కొనసాగుతుందని జోస్యం చెప్పారు. ఈ పదేళ్లలో.. వందేళ్ల అభివృద్ధి చేస్తామన్నారు.

**చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరగదు..**

2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేసిందని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి గోదావరి నీళ్లు రావడానికి సీఎల్పీ నేతగా పీజేఆర్ నడిపిన పోరాటమే కారణమన్నారు. ఐటీ, ఫార్మా, నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్ మారిందంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక పాలసీల వల్లనేనని పేర్కొన్నారు. జంటనగరాలకు నిరంతర విద్యుత్తు ఇవ్వాలని విధాన పరమైన నిర్ణయం తీసుకోవడంతో దిగ్గజ ఐటీ సంస్థలు తరలి వచ్చాయన్నారు. దేశానికి సరఫరా అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని చెప్పారు. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రణాళికలు, విధానపరమైన నిర్ణయాల కారణంగా వచ్చిన ప్రపంచ దిగ్గజ సంస్థలు.. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లుగా మారాయన్నారు. తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసిందన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలన, ఆ తర్వాత కేసీఆర్ పదేళ్ల పాలనతో పోల్చి చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**గుజరాత్‌కు గులాం.. కిషన్‌రెడ్డి!**

సబర్మతీ, గంగా, యమునా రివర్ ఫ్రంట్‌లను అద్భుతమంటూ ఓవైపు బీజేపీ ప్రచారం చేసుకుంటుంటే.. మూసీ రివర్ ఫ్రంట్‌ను మాత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ఇక్కడి పెట్టుబడులు గుజరాత్‌కు తరలి పోవాలన్నదే కిషన్‌రెడ్డి ప్రణాళిక అని, ఆయన గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు వచ్చిన సెమీకండక్టర్లు, పెట్టుబడులను ప్రధాని కార్యాలయం నుంచే బెదిరించి గుజరాత్‌కు పట్టుకుపోతే కిషన్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నా రు. ఆయన తనపై ఒంటి కాలిమీద లేస్తే ఏమొస్తుందని, చేతనైతే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి నిలదీయాలని అన్నారు. లేదంటే మోదీ కాళ్లు పట్టుకుని కొన్ని ప్రాజెక్టులను తెలంగాణకు వదిలేయాలంటూ కోరాలన్నారు. కేటీఆర్‌తో చెడు సావాసాన్ని కిషన్‌రెడ్డి వదులుకోవాలని సూచించారు. బ్యాడ్ బ్రదర్స్ కేటీఆర్, కిషన్‌రెడ్డి అడ్డుకోని అంశాల్లో కేంద్రం ప్రభుత్వం తన వంతు సహకారం అందిస్తోందని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి, బీజేపీ డిపాజిట్లు జప్తు కావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎసను వ్యతిరేకించే ఏ ఎంపీనీ కిషన్‌రెడ్డి ప్రచారానికి రానివ్వడంలేదని ఆరోపించారు.

**డ్రగ్ కల్చర్ ఎవరిదో ఆలోచించండి**

ఎవరిది పబ్ కల్చర్, ఎవరిది డ్రగ్ కల్చర్, గల్లీ గల్లీల్లో గంజాయి, డ్రగ్స్‌కు కారణం ఎవరు అన్నది జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించాలని సీఎం రేవంత్ సూచించారు. వచ్చే పదేళ్లూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తుందని చెప్పారు. నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందన్నారు. సెంటిమెంటా? డెవల్‌పమెంటా? అన్నది జూబ్లీహిల్స్ ప్రజలే తేల్చుకోవాలన్నారు. ఆర్కిటెక్చర్ చదువుకున్న యువకుడిని రౌడీ అనడం బీఆర్‌ఎస్ ఆలోచనా ధోరణికి అద్దం పడుతుందని మండిపడ్డారు. "మా నాన్నను చూపించి నన్ను రౌడీ అంటున్నరు. పాస్‌పోర్టు బ్రోకర్ కొడుకును ఏమనాలి? అని నవీన్ యాదవ్ అందుకే ప్రశ్నించారు" అని రేవంత్ అన్నారు.

**కేసీఆర్ ప్రారంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు..**

బీఆర్‌ఎస్ హయాంలో కొత్తగా ఒక్క యూనివర్సిటీ కూడా తేలేదని, కనీసం వీసీలను కూడా నియమించలేదని సీఎం రేవంత్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలకు పైగా స్కూళ్లను మూసేశారని, రైతులకు వ్యవసాయాన్ని, మహిళలకు రాజ్యాధికారాన్ని దూరం చేశారని ఆరోపించారు. కొత్తగా ఆస్పత్రులనూ నిర్మించలేదన్నారు. కేసీఆర్ హయాంలో నగరంలో చేపట్టిన ఏ ఒక్క ప్రాజెక్టయినా పూర్తయిందా? అని ప్రశ్నించారు. తన రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీని లాభాల బాట పట్టించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, రూ.3 వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిని, వందెకరాల్లో హైకోర్టును నిర్మిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్నబియ్యం ఇస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామన్నారు. కేసీఆర్ ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్నీ ఆపకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల గోదావరి జలాలు తెచ్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బెస్ట్ ఫైనాన్షియల్ పాలసీని తీసుకువస్తామని ప్రకటించారు.

**కాలేజీలు రూల్ ప్రకారం పోదామంటే సిద్ధం: సీఎం రేవంత్**

కాలేజీల నిర్వహణలో నిక్కచ్చిగా రూల్ ప్రకారం పోదామంటే తాను వంద శాతం సిద్ధంగా ఉన్నానని యాజమాన్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. యాజమాన్యాలు రూపాయి కూడా డొనేషన్ తీసుకోవద్దని, మెరిట్ లేకుండా సీట్లు ఇవ్వవద్దని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, కాలేజీ మేనేజ్‌మెంట్‌లతో నిజనిర్ధారణ కమిటీ వేసి ఒక్కో కాలేజీని పరిశీలించి ప్రక్షాళన చేద్దామన్నారు. ఆయా కాలేజీల్లో నిబంధనల ప్రకారం బోధనా సిబ్బంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయా, లేదా అని పరిశీలిద్దామన్నారు. కొన్ని కాలేజీలైతే ఆయా కాలేజీల నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల పేరుమీద కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూలు చేయడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్బన్ ఇంజనీరింగ్ కాలేజీ అయితే కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డొనేషన్లు వసూలు చేస్తున్నారని, మెడికల్ కాలేజీల్లోనైతే ఇంకా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఆయా సీట్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం రూ.35 వేల చొప్పున మాత్రమేనన్నారు. "డొనేషన్లు లేని డిగ్రీ కాలేజీలకు మొదట చెల్లించి.. డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కాలేజీలకు విడతల వారీగా చెల్లిస్తామంటే.. 'లేదు ఒకేసారి కట్టాలి.. లేకుంటే బంద్ పెడతాం' అంటున్నారు. కాలేజీలు బంద్ పెట్టినా ఆరు నెలల తర్వాత వారి ఫీజు రీయింబర్స్‌మెంట్ వారికి వస్తుంది. విద్యాసంవత్సరం కోల్పోయిన విద్యార్థికి ఎవరు జవాబుదారీ? విద్యను రాజ్యాంగం సేవగానే గుర్తించింది కానీ.. వ్యాపారంగా కాదు. కాలేజీలు బంద్ పెట్టడం వల్ల సమస్యకు పరిష్కారం దొరకదు. పిల్లల కోణంలో ఈ సమస్యను చూడాలి" అని సీఎం రేవంత్ అన్నారు.

# పాతబస్తీలో డ్రగ్స్ రాకెట్ ఆగడాలు

-మొదటిపేజీ తరువాయి

చూడనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. పాతబస్తీలో హిందూ అమ్మాయిలు అత్యధికంగా చదువుకునే స్కూళ్లను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ ముఠా అరాచకాలు చేస్తోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన డ్రగ్స్ ముఠా అంతు చూడాలని, హిందూ బాలికల జీవితాలను కాపాడాలని, లేకపోతే పాతబస్తీలో వేలాది మంది హిందూ యువకులతో రక్షక దళాలను రంగంలోకి దింపుతామని హెచ్చరించారు. అవసరమైతే చట్టానికి లోబడి కేంద్ర బలగాలను కూడా పాతబస్తీలో మోహరింపజేయాల్సి ఉంటుందన్నారు. తానే స్వయంగా పాతబస్తీలో పాగా వేసి డ్రగ్స్ ముఠా అంతు చూస్తానని, అందుకు జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. పాతబస్తీలో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే కేరళ ఫైల్స్ సినిమాను తలపిస్తోందన్నారు. మొదట ఈ రాకెట్ ఓ స్కూల్‌లో ఒక అమ్మాయిని లక్ష్యంగా చేసుకొని బర్త్‌డే పేరుతో ముస్లిం అమ్మాయి ఇంటికి పిలిపించి తక్కువ డోస్ ఉన్న డ్రగ్స్ చాక్లెట్ తినిపించారని, ఆ తర్వాత ఆ చాక్లెట్లలో డ్రగ్స్ డోస్ పెంచి అలవాటు చేసి ఆరు రోజుల తర్వాత కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారన్నారు.
అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు విచారణ చేయరని, ఫిర్యాదు చేసిన



ఒకటి రెండ్రోజులకే ఆ అమ్మాయిలను ఇంటి వద్ద వదిలి వెళతారని, విచారణ జరపాలని అడిగితే మీ అమ్మాయి ఎట్లాగూ వచ్చింది కదా, ఇక విచారణ ఎందుకని కేసును క్లోజ్ చేస్తారని చెప్పారు. ఇలాంటి కేసులు అక్కడ చాలా ఉన్నాయన్నారు.
పాతబస్తీ మజ్లిస్ అడ్డా కాబట్టి... ఒవైసీ చెప్పినట్టు నడుస్తోందని, మజ్లిస్ అండతో పోలీసులు డ్యూటీ నిర్వహించకుండా డబ్బులు దండుకుంటున్నారన్నారు. ఈ గ్యాంగ్‌ను పట్టుకునే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, గోషామహల్ అధ్యక్షుడు ఉమా మహేందర్, బీజేపీ నేతలు ఎన్వీ సుభాశ్, జి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా?**

జూబ్లీహిల్స్ ప్రజలు నిర్ణయించుకోవాలి: బండి

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి కావాలో.. అరాచకం కావాలో జూబ్లీహిల్స్ ప్రజలు నిర్ణయించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం పాదయాత్ర నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'మళ్లీ చెబుతున్నా హిందువులు అంటే బీజేపీ, బీజేపీ అంటే హిందువులు.. బీజేపీ 80 శాతం మంది హిందువుల పక్షాన పోరాడుతోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు 20 శాతం ముస్లింల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి'అని సంజయ్ ఆరోపించారు. హిందువుల ఓట్లే అవసరం లేదన్నట్టు ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్ జూన్ 8న మృతి చెందారు. కొడుకు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గోపీనాథ్ తల్లి అదే నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధారాలు, ఫిర్యాదు కాపీ నాదగ్గరున్నాయి'అని బండి సంజయ్ పేర్కొన్నారు. ఆయన కుమారుడిని విదేశాల నుంచి ఇండియాకు రానీయకుండా మాజీ మంత్రి బెదిరించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 'గోపీనాథ్ ఆస్తులపై సునీతతో కలసి కేటీఆర్ కుట్ర చేస్తున్నారు. ఈ కుట్రలో సీఎం రేవంత్‌కు వాటా ఉంది'అని ఆరోపించారు. దీపక్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చేబాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

# న్యాయ సహాయం నైతిక బాధ్యత

న్యూఢిల్లీ

ప్రజలకు న్యాయ సహాయం అందించడం అనేది కేవలం దాతృత్వ చర్య మాత్రమే కాదని.. అదొక నైతిక బాధ్యత అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. న్యాయ సహాయ ఉద్యమంలో పాల్గొనేవారు చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని, కక్షిదారుల పట్ల సేవాదృక్పథంలో మెలగాలని సూచించారు. ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో 'న్యాయ సహాయ యంత్రాంగాల బలోపేతం'అనే అంశంపై జాతీయ సదస్సు ముగింపుతోపాటు 'లీగల్ సర్వీసెస్ డే'కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా), స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎస్ఎల్ఎస్ఏ)ల్లో సలహా కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ గవాయ్ సూచించారు. విధానపరమైన ప్రణాళికలు సజావుగా కొనసాగేలా చూడడానికి ఈ కమిటీలు అవసరమని చెప్పారు. న్యాయ సహాయం అనేది ప్రభుత్వ పరిపాలనలో ఒక భాగమని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. న్యాయ సహాయకులు న్యాయ పాలకులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలన్నారు. తాను 'నల్సా'లో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలందించానని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. అప్పట్లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కలిసి పనిచేశానని చెప్పారు. విధి నిర్వహణలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు కలిసి వెళ్లేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. మన రాజ్యాంగ ఆత్మ వ్యక్తీకరణకు న్యాయ సహాయ ఉద్యమం ఒక చక్కటి ఉదాహరణ అని అభివర్ణించారు.

**ఉత్సాహంగా లాయర్ల వాకథాన్**

ఢిల్లీలో ఆదివారం లాయర్ల వాకథాన్ ఉత్సాహంగా జరిగింది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చీఫ్ వికాస్ సింగ్ జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. సుప్రీంకోర్టు ప్రాంగణం నుంచి 8 కిలోమీటర్ల దూరంలోని ఇండియా గేట్ దాకా లాయర్ల నడక కొనసాగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ సంజయ్ కరోల్ సహా 2,000 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే వాకథాన్ సందర్భంగా న్యాయమూర్తులు మొక్కలు నాటారు.

## కేసీఆర్ బాటలోనే రేవంత్

-మొదటిపేజీ తరువాయి

గెలిపించాలి'అని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు, రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు, రూ.4వేల నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు వంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర సాయంపై బహిరంగ చర్చకు సిద్ధం**

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై బహిరంగ చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఏమీ చేయలేదంటూ ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీజేపీ, కేంద్రంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తోందంటూ ఈ పార్టీలు కేంద్రంపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నాయని, కానీ వాస్తవాలు వేరేలా ఉన్నాయని తెలిపారు. 2014లో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను మంజూరు చేసిందని, 2023 జూన్ 7న తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం పాత్ర పేరిట బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తాను ప్రజెంటేషన్ ఇచ్చానని వివరించారు. మరోసారి తెలంగాణ అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చ జరిగేవిధంగా సహకరించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు కిషన్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, అందుకే తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో బహిరంగ చర్చ జరిపేందుకు రెడీగా ఉన్నామన్నారు. బహిరంగ చర్చకు తేదీ, సమయం నిర్ణయించి వారిద్దరినీ ఆహ్వానించాలని ప్రెస్ క్లబ్‌ను కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి మాట్లాడే భాష పార్లమెంటరీ పద్ధతిలో ఉండేలా, సానుకూల చర్చ జరిగే విధంగా చూడాలని సూచించారు.

## అభివృద్ధి, సంక్షేమం చూసి మాకు ఓటెయ్యండి

-మొదటిపేజీ తరువాయి

ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లతో కలసి భట్టి మాట్లాడారు. "పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి సర్కారు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే.. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేయనున్నాం. ఈ నియోజకవర్గంలోని 15,000 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలిచ్చాం. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నాం. సంక్షేమ పథకాల అమలులో భాగంగా రాష్ట్రంలో 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారు. హరీశ్‌రావు మాపై ఆదాయపు పన్నుశాఖ దాడులు జరిగాయంటూ అంటున్నారు. నిజంగా జరిగితే గోప్యంగా ఉంచుతారా? ఉపఎన్నికలో ఓడిపోతామన్న భయంతోనే ఇదంతా చేస్తున్నారు" అని విమర్శించారు. అనంతరం మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మాట్లాడారు.

**20 వేల మెజారిటీతో గెలుస్తున్నాం**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో 20 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తున్నాం. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. మాపార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు పలుకుతున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డూ ఇవ్వలేదు. మేం 22 నెలల్లోనే 14 వేల మంది స్థానికులకు కార్డులిచ్చాం.

**వచ్చే మూడేళ్లలో మరింతగా అభివృద్ధి : పొన్నం**

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌ను గెలిపిస్తే వచ్చే మూడేళ్లలో 'జూబ్లీహిల్స్'లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపడతాం. కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణను చూసి భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు అసహనంతో మాట్లాడుతున్నారు. ఈ దఫా ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల ప్రజలంతా నవీన్‌కు మద్దతుగా నిలవాలి.

## రేవంత్ మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో..

హైదరాబాద్



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటర్లు దిమ్మతిరిగే తీర్పు ఇస్తే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో తేలిపోతుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఒక్క సీటు కోసం సీఎం కూడా ప్రచారం చేస్తున్నారంటే.. వాళ్లు ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. దిల్లీలో రేవంత్‌పై నల్గొండ, ఖమ్మం నేతలు కత్తులు నూరుతున్నారని.. సీఎం కుర్చీకోసం కొందరు నేతలు సిద్ధమవుతున్నారన్నారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకుంటే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని.. అందర్నీ కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత తమదని పేర్కొన్నారు. ఉప ఎన్నిక ప్రచారం చివరి రోజు ఆదివారం సాయంత్రం యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. 'ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తీయని మాటలు చెప్పి.. తర్వాత పైసలు లేవని చేతులెత్తేస్తారు. ఆరు గ్యారంటీలతో అన్నివర్గాలను మోసం చేసిన వ్యక్తి జూబ్లీహిల్స్‌కు న్యాయం చేస్తారా? రెండేళ్ల క్రితం ఒకసారి మోసపోయినందుకే ఇప్పటికీ అవస్థలు పడుతున్నాం. కేసీఆర్ పదేళ్ల.. రేవంత్ రెండేళ్ల పాలనను చూసి ఆలోచించి ఓటేయాలి. భారత రాష్ట్ర సమితిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబితేనే ఆడబిడ్డలకు రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛను పథకాలు అమలవుతాయి. జూబ్లీహిల్స్‌లోని 4 లక్షల ఓటర్లకు.. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజలకు న్యాయం చేసే అవకాశం దక్కింది.

**అసదుద్దీన్ ఎందుకు మారిపోయారు..**

నియోజకవర్గానికి వచ్చి ముస్లింలను కూడా రేవంత్‌రెడ్డి బెదిరించారు. ముస్లిం సోదరులంతా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్ఎస్ మనిషని.. గాంధీభవన్‌ను మోహన్ భాగవత్ నడిపిస్తున్నారన్న అసదుద్దీన్ ఇప్పుడు ఎందుకు మారిపోయారు. కాంగ్రెస్ ఏమిచ్చిందని ఆ పార్టీ కోసం ప్రచారం చేస్తున్నారో చెప్పాలి. బుల్డోజర్‌ను ఆపాలంటే కారు గుర్తుకు ఓటేయాలి. కత్తి మాకు ఇవ్వండి.. బుల్డోజర్‌కు అడ్డంగా వెళ్లి ఆపే బాధ్యత మాది.

**కాంగ్రెస్ దొంగదారిలో గెలవాలని చూస్తోంది..**

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతుందని తెలిసి కూడా ఓట్ల కోసం డబ్బులు పంచుతున్నారు. పోలింగ్ రోజున ప్రజలు బయటికి వచ్చి ఓట్లేయకపోతే హస్తం పార్టీ నేతలు దొంగ ఓట్లు వేయాలని చూస్తున్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలోనే యూసుఫ్‌గూడలో రూ.12 కోట్లతో డ్రైనేజీ పనులు ప్రారంభించి.. రూ.2కోట్ల పనులు పూర్తి చేశాం. మిగిలిన వాటిని సునీతమ్మ గెలిచాక చేయించే బాధ్యత నాది' అని కేటీఆర్ చెప్పారు.

## ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో విజయం మాదే!

కిషన్‌గంజ్

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్కడికెళ్లినా కూడా ఓట్ల చోరీ విషయంలో దొరికిపోతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో నూటికి నూరు శాతం ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన కిషన్‌గంజ్, పూర్ణియా సభల్లో మాట్లాడారు. దేశాన్ని విభజించడానికి బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే ఇండియా కూటమి మాత్రం దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఓటు చోరీపై తాము చేసిన ఆరోపణలకు మోదీ, షా, ఈసీ వద్ద ఎలాంటి సమాధానం లేదని, ఇప్పుడు వాస్తవాలన్నీ ప్రజల ముందుకు వచ్చాయని అన్నారు. హరియాణాలో పెద్దఎత్తున ఓట్ల చోరీ జరిగిందని ఇటీవల తాను బయటపెట్టానని గుర్తుచేశారు. దీనిపై మోదీ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పందించలేదని, రాహుల్ అబద్ధాలాడుతున్నాడని చెప్పే ధైర్యం వారు చేయలేదన్నారు. ఓటింగ్ రోజున (నవంబరు 11న) పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండి ఓట్ల చోరీని అడ్డుకోవాలని యువత, కార్మికులు, రైతులకు ఆయన పిలుపునిచ్చారు. చేపలు, మఖనా సమృద్ధిగా లభించే రాష్ట్రంలో 20ఏళ్లలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీశ్ కుమార్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

**ఓటు చోరీని కప్పిపుచ్చే యత్నం.. 'సర్'**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎసఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చడానికి, వ్యవస్థను సంస్థాగతీకరించడానికి చేస్తున్న ప్రయత్నమని రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి ఆయన ఆదివారం నర్మదాపురంలోని పంచ్‌మర్హికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హరియాణాలో 25 లక్షల ఓట్లను చోరీ చేశారని, ఇదే తరహాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీసగఢ్‌ల్లోనూ జరిగి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై తమవద్ద మరిన్ని ఆధారాలతో పాటు వివరణాత్మక సమాచారం ఉందని, దాన్ని కూడా త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ చూపించింది చాలా స్వల్పమేనని చెప్పారు. అనంతరం సాత్పురా టైగర్ రిజర్వ్‌లోని పనార్పణిలో రాహుల్ జంగిల్ సఫారీకి వెళ్లారు. దీనిపై బీజేపీ ఘాటుగా స్పందించింది. బిహార్ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందో రాహుల్‌కు ముందే అర్థమైపోయిందని, అందుకే సెలవు తీసుకొని మరీ జంగిల్ సఫారీని ఆస్వాదిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి ఆయన ప్రాధాన్యతలు ఏమిటో తెలుస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మాత్రం ఈసీఐపై నిందలు వేస్తూ హెచ్(హాలిడే) ఫైల్స్‌పై ప్రజంటేషన్ ఇస్తారని ఆరోపించారు. బిహార్ ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రజల నుంచి కాకుండా జంతువుల నుంచి ఓట్లు అడగడానికి రాహుల్ అడవికి వచ్చారా అని మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ సారంగ్ ప్రశ్నించారు. రాజకీయాలను రాహుల్ గాంధీ ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని ఆయన విమర్శించారు.

## మళ్లీ అణు సైరన్!

మన ప్రపంచం మళ్లీ 'అణు'భయంలోకి వెళుతోంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తర్వాత తిరిగి అణ్వాయుధ పోటీ మొదలవుతోంది. ఒకప్పుడు అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధంతో ప్రపంచమంతా వణికిపోతే.. ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధ పరిణామాలతో అమెరికా, రష్యా మధ్య ఉప్పునిప్పుగా మారిన పరిస్థితి కలకలం రేపుతోంది. అణుశక్తితో నడుస్తూ, అణ్వస్త్రాలను ప్రయోగించే సామర్థ్యమున్న అత్యాధునిక క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల వెల్లడించగా.. తాము అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అక్టోబరు 22న రష్యా అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించి డ్రిల్స్ కూడా నిర్వహించింది.

**'స్టార్‌వార్స్' నుంచి నేటి 'పొసైడాన్' వరకు..**

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా అగ్రరాజ్యంగా అవతరించింది. జపాన్‌పై చేసిన అణుదాడితో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం అమెరికానే అనే అభిప్రాయం కలిగించింది. అమెరికాకు దీటుగా నిలిచేందుకు నాటి సోవియట్ యూనియన్ పెద్ద ఎత్తున అణ్వాయుధాలు, క్షిపణులను తయారు చేసింది. ఈ క్రమంలో సోవియట్ యూనియన్ నుంచి రక్షణ కోసమని 1983లో నాటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 'స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ (ఎస్‌డీఐ)'ను ప్రకటించారు. భూమితోపాటు అంతరిక్షంలోనూ రాడార్లు, క్షిపణులు, లేజర్ ఆయుధాలను మోహరిస్తామని ప్రకటించారు. ఈ ఎస్‌డీఐనే 'స్టార్‌వార్స్'గా కూడా పిలుస్తారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడంతో అమెరికా దూకుడు తగ్గించుకుంది. కానీ సోవియట్‌లో భాగమైన రష్యా పోటీగా నిలవడంతో మళ్లీ ఆయుధాల రేసు మొదలైంది. ఈ క్రమంలో 10 వేల కిలోమీటర్లకుపైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణి మినట్ మ్యాన్–3, జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ట్రైడెంట్–2 డీ5 బాలిస్టిక్ క్షిపణుల (7,300 కి.మీ. పరిధి)ను, బీ–2 వంటి అత్యాధునిక, స్టెల్త్, భారీ బాంబర్లను అమెరికా అభివృద్ధి చేసింది. మరోవైపు రష్యా కూడా 18వేల కిలోమీటర్ల పరిధి ఉన్న ఆర్‌ఎస్–28 సర్మత్ వంటి క్షిపణులను, క్షిపణుల నుంచి విడివడి గంటకు 24 వేల కిలోమీటర్ల వేగంతో లక్ష్యంపై దాడి చేయగల అవన్‌గార్డ్ వంటి గ్లైడ్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. తాజాగా అణుశక్తితో నడిచే, అణ్వాయుధ సామర్థ్యమున్న బురెవెస్టనిక్ క్రూయిజ్ క్షిపణి, పొసైడాన్ టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. బురెవెస్టనిక్ క్షిపణి అణుశక్తితో దూసుకెళ్తుంది కాబట్టి.. దానికి గరిష్ఠ పరిమితి ఏమీ లేదని, ప్రయోగ సమయంలో 15 గంటల్లో 14 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిందని రష్యా తెలిపింది. ఇక జలాంతర్గామి నుంచి ప్రయోగించే పొసైడాన్ టార్పెడో కూడా సముద్రంలో అడుగున ప్రయాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లి విధ్వంసం సృష్టించగలదని చెబుతున్నారు.

**'అణు'తెరపై చైనా దూకుడు**

ప్రపంచంలో ఆర్థిక పరంగా రెండో అతిపెద్ద దేశంగా ఎదిగిన చైనా కూడా అగ్రరాజ్యం అనిపించుకోవడానికి 'అణు'మార్గం పట్టింది. కొన్నేళ్లుగా అణ్వస్త్రాల తయారీ వేగాన్ని పెంచింది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 2030 నాటికి ఈ సంఖ్య 1000 దాటుతుందని అంచనా. కానీ చైనా భారీ స్థాయిలో అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తోందని.. వచ్చే ఐదారేళ్లలో అమెరికా, రష్యాలతో సమానంగా చైనా వద్ద అణ్వస్త్రాలు ఉంటాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

**అణు పరీక్షలకు సిద్ధమవుతున్న పాక్?**

పాకిస్థాన్ తమ సింధ్ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో రహస్యంగా సొరంగాల నిర్మాణం చేపట్టింది. అది అణు పరీక్షల కోసమేనని సింధు ప్రాంతంలోని పౌర సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ)లకు తాజాగా ఫిర్యాదు చేశాయి. పాకిస్థాన్ రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తోందని ఇటీవల ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

**ప్రపంచంపై ఆధిపత్యం కోసం..**

ప్రపంచంలో తొలిసారిగా అమెరికా అణ్వాయుధాల తయారీ కోసం 1942లో మాన్‌హట్టన్ ప్రాజెక్టును చేపట్టింది. 1945లో జూలైలో ట్రినిటీ పేరిట తొలి అణు పరీక్ష నిర్వహించింది. అదే ఏడాది ఆగస్టులో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై వేసిన అణు బాంబులు ప్రపంచ గతినే మార్చేశాయి. అగ్ర రాజ్యాల మధ్య అణ్వాయుధ పోటీ మొదలైంది. 1949 ఆగస్టులో సోవియట్ యూనియన్ 'ఫస్ట్ లైట్నింగ్' పేరిట తొలి అణుపరీక్ష నిర్వహించింది. ప్రపంచం రెండు ధ్రువాలుగా మారిపోయింది. ఈ క్రమంలో 1962లో ప్రపంచం ఒకసారి అణుయుద్ధం అంచుల వరకు వెళ్లింది. అమెరికాకు సమీపంలో ఉన్న కమ్యూనిస్టు దేశం క్యూబాలో సోవియట్ యూనియన్ క్షిపణులు మోహరించిన విషయం తెలిసి అమెరికా అగ్గిమీద గుగ్గిలమైంది. ఇరుదేశాల యుద్ధ నౌకలు, విమానాల మోహరింపుతో అణు యుద్ధం మొదలైనట్టేనన్న పరిస్థితి నెలకొంది.

# ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలి

దెహ్రాదూన్

ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రంలో జనాభా స్థితిగతుల్లో మార్పులు రాకుండా ధైర్యంగా చర్యలు చేపట్టిందని, ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తోందని, చట్టవిరుద్ధమైన మత మార్పిడులను సమర్థంగా అడ్డుకుంటోందని చెప్పారు. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలని సూచించారు. యూసీసీ అమలుపై ఉత్తరాఖండ్ చర్యలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మత మార్పిడుల నియంత్రణ చట్టం, అల్లర్ల నియంత్రణ చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేస్తోందని తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం అవతరించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం దెహ్రాదూన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. రూ.8,260.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల భూములు కబ్జా కాకుండా, జనాభాలో అవాంఛనీయ మార్పులు రాకుండా ఇక్కడి బీజేపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టిందని



వెల్లడించారు. అభివృద్ధి ప్రయాణంలో అడ్డంకులను తొలగించుకుంటూ ఉత్తరాఖండ్ శరవేగంగా ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రం ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారనుందని అన్నారు.

**రాష్ట్ర ప్రజలే నాకు స్ఫూర్తి**

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్‌తో తనకు గొప్ప అనుబంధం ఉందన్నారు. కొండలపై ప్రతికూల వాతావరణంలో జీవిస్తూ కష్టపడి పనిచేసే ఇక్కడి ప్రజలు తనకు నిత్యం స్ఫూర్తినిస్తుంటారని చెప్పారు. ఈ దశాబ్దం ఉత్తరాఖండ్‌దేనని తేల్చిచెప్పారు. రాష్ట్రం బలం ఆధ్యాత్మిక శక్తిలోనే ఉందన్నారు. గత 25 ఏళ్లలో అనూహ్యమైన ప్రగతి సాధించిందని కొనియాడారు.

విద్య, పర్యాటకం, ఆరోగ్యం, ఇంధనం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. 25 ఏళ్ల క్రితం రాష్ట్రం బడ్జెట్ రూ.4,000 కోట్లు మాత్రమేనని, ఇప్పుడు రూ.లక్ష కోట్లకు చేరిందని స్పష్టంచేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకోసం ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేయాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన కేంద్రాలు, యోగా కేంద్రాలను గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తామని చెప్పారు.

# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

హైదరాబాద్/ సిటీ, రాజేంద్రనగర్

దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉగ్ర దాడులకు పన్నిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి ఆదివారం విలేకరులకు తెలిపిన సమాచారం ప్రకారం.. ప్రమాదకర రసాయనాలు, ఆధునిక ఆయుధాలతో భారీ ఉగ్రదాడికి కుట్ర చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్(35), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను అరెస్టు చేశారు. మొహియుద్దీన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 7న రెండు గ్లోక్ పిస్టళ్లు, ఒక బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు లీటర్ల కాస్టర్ ఆయిల్, రిసిన్ తయారీకి వాడే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విచారణలో తాను గాంధీనగర్ జిల్లాలో మారుమూల ఉన్న కలాల్ ప్రాంతంలో ఈ ఆయుధాలను అందుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఉగ్ర కార్యకలాపాలు చేపట్టేందుకే వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేసే క్రమంలో ఉగ్రవాదులతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఐఎసకేపీ(ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్)కు చెందిన అబూ ఖదీజా(అఫ్ఘనిస్థాన్) ఇతడితో సంప్రదింపులు జరుపుతున్నాడని గుర్తించారు. ఖదీజాకు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి. చైనాలో వైద్యవిద్య చదివిన మొహియుద్దీన్ దేశంలో భారీ ఉగ్రదాడులు జరిపేందుకు అత్యంత విషపూరితమైన రిసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ చెప్పారు. అతడి ఫోన్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా అతడికి ఆయుధాలు అందించిన యూపీకి చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్‌లో సేకరించిన ఆయుధాలను వీరు మొహియుద్దీన్‌కు అందించారు. పాకిస్థాన్‌లోని వీరి హ్యాండ్లర్ డ్రోన్ ద్వారా ఆ ఆయుధాలను పంపాడని డీఐజీ వెల్లడించారు. కాగా వీరు ఉగ్రదాడులు జరిపేందుకు లఖ్‌నవూ, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని పలు రద్దీ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. మొహియుద్దీన్ అరెస్టుతో నగరంలోని రాజేంద్రనగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. ఇతడు నివాసం ఉంటున్నది ఈ కాలనీలోనే. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీ రోడ్డు నెంబరు 9లోని ఆషాద్ మంజిల్ మొదటి అంతస్తులో ఇతడు నివాసం ఉంటున్నట్లు సమాచారం.

**ఎక్కడ ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా హైదరాబాద్‌కు లింకులు**

దేశంలో ఎక్కడ ఎప్పుడు ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఎక్కడ ఉగ్రవాద సానుభూతి పరులు అరెస్టయినా హైదరాబాద్ నగరంతో వారికి ఏదో ఒక లింకు ఉంటోంది. హైదరాబాద్ నగరం ఉగ్రవాదులకు ఒక షెల్టర్ జోన్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది సెప్టెంబరులో ఐఎస (ఇస్లామిక్ స్టేట్) ఉగ్రవాద సంస్థకు చెందిన యువకుడు రిజ్వాన్ అలీ నగరానికి వచ్చి ఆశ్రయం పొంది తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఇతడు సైదాబాద్‌లోని శంకేశ్వర బజార్‌లో సుమారు ఆరు నెలలపాటు తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలింది. గతేడాది నగరంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ఒక సదస్సు సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో జరిగినా.. పోలీసు నిఘా వ్యవస్థ కనిపెట్టలేక పోయిందనే చర్చ జరుగు తోంది. మహారాష్ట్ర సహా.. వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ఇస్లామిక్ సానుభూతిపరులు హోటల్లో దిగి నెల రోజులపాటు మత విద్వేష సదస్సును ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించారంటే.. నగరాన్ని వారు ఎంత సేఫ్టీ జోన్‌గా వాడుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ సదస్సుకు హాజరైన ఓ యువకుడు ముత్యాలమ్మ ఆలయంలోకి వెళ్లి అమ్మవారి విగ్రహాన్ని కాలితో తన్ని ధ్వంసం చేశాడు.

# బిహార్ ప్రచారానికి తెర

న్యూఢిల్లీ



బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. ప్రచార పర్వం ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఇన్నాళ్లూ రాజకీయ పార్టీల నినాదాలు, ప్రసంగాలతో హోరెత్తిపోయిన గ్రామాలు, పట్టణాలు నిశ్శబ్దంగా మారిపోయాయి. చివరిదైన రెండో దశ పోలింగ్ ఈ నెల 11వ తేదీన 122 నియోజవర్గాల్లో జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 6వ తేదీన 121 స్థానాల్లో జరిగిన తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశలో కీలక నేతలు పోటీపడుతున్నారు. బిహార్ ఎన్నికల చరిత్రలో 5 శాతానికి మించి ఓటింగ్ పెరిగిన ప్రతిసారీ.. అది అధికార మార్పిడికే దారితీసిందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. ఈసారి భారీ ఓటింగ్ నమోదు కావడం తమకే అనుకూలమని ఇరుపక్షాలూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**సమీకరణాల చదరంగం**

రెండో దశలో పోలింగ్ జరుగనున్న 122 నియోజకవర్గాలు అత్యంత సంక్లిష్టమైనవి. ఇక్కడ ప్రచారం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కుల సమీకరణాలు, ఓట్ల చీలిక వంటి అంశాలే అభ్యర్థుల గెలుపోటములను శాసించనున్నాయి. రెండో దశలో సీమాంచల్ అత్యంత కీలకం. కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కతిహార్ వంటి జిల్లాలున్న ఈ ప్రాంతంలో ముస్లిం మైనారిటీల జనాభా ఎక్కువ. ఇది దశాబ్దాలుగా ఆర్జేడీ%–%కాంగ్రెస్ కూటమికి కంచుకోట. అయితే, 2020 నాటి ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ నేతత్వంలోని ఎంఐఎం ఇక్కడ 5 స్థానాలు గెలుచుకొని మహాగఠ్‌బంధన్ ఓట్లను చీల్చింది. మైనారిటీల ఓట్లను ఆకర్షించేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతుండగా.. ఎంఐఎం సైతం అదే ఓటు బ్యాంకుకు గాలం వేస్తోంది. ఈ 'ఓట్ల చీలిక'అంతిమంగా ఎన్డీఏకు లాభం చేకూరుస్తుందనడంలో సందేహం లేదు. రెండో దశలోనూ కులమే ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ముస్లిం%–%యాదవ్ సమ్మేళనం మహాగఠ్‌బంధన్‌కు ప్రాణవాయువు లాంటిది. ఆర్జేడీ అభ్యర్థులు పూర్తిగా ఈ ఓటు బ్యాంకును నమ్ముకుంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బలం ఈబీసీలు, మహాదళితులే. ఈ నిశ్శబ్ద ఓటు బ్యాంకు గత రెండు దశాబ్దాలుగా జేడీయూ వెంటే నడుస్తోంది. భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ వర్గాలు ఆనవాయితీగా బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నాయి.

**ఓట్ల చీలికలతో తంటాలు**

ఈ ఎన్నికల్లో 'ఓట్లను చీల్చే'పార్టీల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ చాలా నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులను నిలబెట్టింది. ఇది సంప్రదాయ రాజకీయాలకు అలవాటుపడని ఓటర్లను ఆకర్షిస్తోంది. ఈ పార్టీతో జేడీ(యూ), ఆర్జేడీలకు కొంత నష్టం జరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'సన్ ఆఫ్ మల్లా'గా పిలుచుకునే ముకేశ్ సహానీ.. బిహార్ నిషాద్ (మత్స్యకార) వర్గంలో గట్టి పట్టున్న నాయకుడు. ఈయన మహాగఠ్‌బంధన్‌లో భాగస్వామిగా ఉండటం ఆర్జేడీకి కలిసొచ్చే అంశం.

**సమస్యాత్మక ప్రాంతాలు**

రెండో దశలో పోలింగ్ జరగనున్న పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢీ వంటి జిల్లాలు నేపాల్ సరిహద్దును ఆనుకొని ఉన్నాయి. ఇక్కడ ఎన్నికల నిర్వహణ భద్రతా బలగాలకు పెద్ద సవాల్. ఎన్నికలకు 72 గంటల ముందే నేపాల్ సరిహద్దును మూసివేశారు. అసాంఘీక శక్తులు సరిహద్దులు దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మరోవైపు సీమాంచల్ ప్రాంతం మతపరంగా అత్యంత సున్నితమైనది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రాంతాల్లో భారీగా సాయుధ బలగాలను మోహరించింది. ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 14న ఫలితాల కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## బిజినెస్

### మునుపెన్నడు లేనంతగా..
### రికార్డుస్థాయిలో వాహన విక్రయాలు

**పండుగ సీజన్‌లో 52 లక్షల యూనిట్ల అమ్మకాలు**



**న్యూఢిల్లీ :** వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. ఈ పండుగ సీజన్‌లో మునుపెన్నడు లేనంతగా 52 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. 42 రోజుల పాటు సాగిన పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో వాహనాలు అమ్ముడయ్యాయయని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం ఫాడా తాజాగా వెల్లడించింది. వీటిలో ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అత్యధికంగా ఉన్నాయని తెలిపింది. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతోపాటు ఆదాయ పన్నులో సంస్కరణలు తీసుకురావడంతో వాహన అమ్మకాలు భారీగా పుంజుకోవడానికి దోహదం చేశాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. ఈసారి పండుగ సీజన్‌లో 52,38,401 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 43,25,632 యూనిట్లతో పోలిస్తే 21 శాతం వృద్ధిని సాధించింది. వీటిలో 7,66,918 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడవగా, అలాగే 40,52,503 యూనిట్ల ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం, నిధుల లభ్యత అధికంగా ఉండటం, జీఎస్టీతో వాహన ధరలు దిగిరానుండటం అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణమని విఘ్నేశ్వర్ అన్నారు.

### 2025-26లో వృద్ధి 6.8 శాతంపైనే


దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.8 శాతాన్ని మించే వీలుందని ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) రేటు తగ్గింపు, ఆదాయ పన్ను రాయితీలు వినియోగాన్ని ప్రోత్సహించి, వృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సర్వేలో 6.3-6.8 శాతం వృద్ధిని అంచనా వేశామని, ఇప్పుడు 6.8 శాతానికి మించి సాధించగలమనే విశ్వాసం వచ్చిందన్నారు. రెండో త్రైమాసిక గణాంకాలు వచ్చిన తర్వాత 7 శాతానికి దగ్గరగా వెళ్లే అవకాశమూ ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించింది. వ్యవసాయం, వాణిజ్యం, ఆతిథ్యం, ఆర్థిక సేవలు, స్థిరాస్తి రంగాలు బలంగా ఉన్నాయని నాగేశ్వరన్ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చిలో 8.4 శాతం వృద్ధి నమోదయిందనీ, అదే సమయంలో చైనాలో 5.2 శాతం వృద్ధి ఉన్నట్లు తెలిపారు. దీంతో భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్నారు. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) త్వరలో పూర్తయితే, వృద్ధి అంచనాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

# కియోసాకి ఆర్థిక సూత్రాలు: ధనవంతులయ్యే మార్గాలు

వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు, రచయిత అయిన రాబర్ట్ కియోసాకి.. ఒక వ్యక్తి ధనవంతుడు కావాలంటే.. ఏం చేయాలి?, ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? అనే సూచనలు ఇస్తూ ఉంటారు. ఈయన రాశిన పుస్తకాలలో ఒకటైన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' కూడా ఎలా నడుచుకుంటే.. మీరు ఉన్నత స్థాయికి చేరుతారనే విషయాలను వెల్లడిస్తుంది. ఈ కథనంలో కియోసాకి ఆర్థిక సూత్రాల గురించి తెలుసుకుందాం.

**కియోసాకి ఆర్థిక సూత్రాలు**

ఆస్తులు కొనండి, బాధ్యతలు తగ్గించండి: కియోసాకి ప్రకారం.. ఆస్తులు అంటే మీ జేబులోకి డబ్బు తెచ్చేవి. ఉదాహరణకు వ్యాపారం చేయడం, ఇల్లు అద్దెకు ఇవ్వడం, పెట్టుబడులు పెట్టడం లాంటివన్నమాట. ఇక బాధ్యతలు అంటే.. మీ చేతిలో ఉన్న డబ్బు ఖర్చయిపోయేవి. కారు లోన్, ఖరీదైన జీవన విధానం. దీనివల్ల డబ్బు రాదు. కాబట్టి ధనవంతులు ఆస్తులు కొనుగోలు చేస్తారు, పేదవారు బాధ్యతలనే ఆస్తులుగా భావిస్తారు. ఆర్థిక విద్య: సంప్రదాయ విద్య.. వల్ల ఉద్యోగం వస్తుంది. కానీ మీరు నేర్చుకునే ఆర్థిక విద్య మీకు స్వేచ్ఛను ఇస్తుంది. డబ్బు ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడమే విజయానికి మూలం అంటారు కియోసాకి. ఆదాయం కంటే కూడా.. ఆదాయ ప్రవాహం ఎలా ఉందో నేర్చుకోండి. డబ్బు కొంత సంపాదించిన



తరువాత.. మీరు పనిచేయకపోయినా.. మరింత డబ్బు వచ్చే ఉత్తమ మార్గాలను ఎంచుకోవాలి. నేర్చుకోవడానికి ప్రాధాన్యం: మీరు చేసేపని ప్రధానంగా డబ్బు కోసం కాకుండా.. నేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే మీరు చేసే పనిలో లేదా ఉద్యోగంలో నైపుణ్యాలను పెంచుకోండి. మార్కెటింగ్, రియల్ ఎస్టేట్, స్టాక్స్, బిజినెస్ వంటి వాటి మీద పట్టు సంపాదించండి. ఇవన్నీ నేర్చుకున్న తరువాత.. ఎలా డబ్బు సంపాదించాలో మీకే అర్థమవుతుంది.

పెట్టుబడి: చాలామంది పెట్టుబడి ప్రమాదకరం అనుకుంటారు. నిజానికి ఈ ప్రమాదం అవగాహన లేకపోవడం వల్ల వస్తుంది. కాబట్టి అవగాహన ముఖ్యం. మిడిమిడి జ్ఞానంతో పనిచేస్తే ఆర్థిక నష్టాలు చూడాల్సి వస్తుంది. అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకోండి. మిమ్మల్ని మీరు బిల్డ్ చేసుకోండి. తరువాత పెట్టుబడులు పెట్టండి. డబ్బు కోసం కాదు.. మీ కోసం డబ్బు: డబ్బు కోసం మీరు పనిచేయడం కాదు, డబ్బు మీ కోసం పనిచేయాలి అంటారు కియోసాకి. ఉదాహరణకు ఒక ఉద్యోగం చేస్తారు, జీతం వస్తుంది, నెలవారీ బిల్లులు చెల్లిస్తారు. మిగిలిన డబ్బు ఖర్చు చేస్తారు. ఇదే జీవితాంతం కొనసాగుతుంది. ఇదే డబ్బు కోసం పనిచేయడం అన్నమాట.

డబ్బు మీ కోసం పనిచేయడం అంటే.. ఒక ఇల్లు కొంటారు, దాన్ని అద్దెకు ఇస్తారు. మీకు ప్రతి నెలా డబ్బు వస్తుంది. మీరు షేర్లలో పెట్టుబడి పెడితే, కంపెనీ లాభాల్లో భాగంగా డివిడెండ్ వస్తుంది. ఏదైనా వ్యాపారం ఉంటే.. మీరు పని చేయకపోయినా వ్యాపారమే మీకు డబ్బు సంపాదిస్తుంది. ఇంకా చెప్పాలంటే.. మీరు ఒక బుక్ రాశినా, సాఫ్ట్‌వేర్ రూపొందించినా, మ్యూజిక్ క్రియేట్ చేసినా అవి అమ్ముడవుతాయి. తద్వారా మీకు డబ్బు వస్తుంది.

# మొబైల్ రీచార్జీలకు రెక్కలు!

**న్యూఢిల్లీ :** మొబైల్ వినియోగదారులకు మళ్లీ షాకివ్వబోతున్నాయి టెలికాం సంస్థలు. ఇప్పుడికే మొబైల్ చార్జీలను పెంచి కస్టమర్ల జేబులకు చిల్లులు పెట్టిన సంస్థలు తాజాగా మరోసారి రీచార్జీలను పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఏడాది క్రితం 23 శాతం వరకు చార్జీలను వడ్డించిన సంస్థలు మళ్లీ ఈ స్థాయిలో పెంచడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెల 1 నుంచి తమ మొబైల్ రీచార్జి ప్లాన్ల ధరలను 10-12 శాతం వరకు పెంచేయోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. దేశీయ టెలికాం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో ప్రీ-పెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్లు మరింత భారం కాబోతున్నాయి. నిర్వహణ ఖర్చులు సాకుగా చూపెడుతూ టెలికాం టారిఫ్‌లను భారీగా పెంచిన సంస్థలు..ఈసారి కూడా ఇదే సాకుగా చూపెడుతు, అలాగే 5జీ సేవలు అందించడానికి భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తున్నదని, దీంతో సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడానికి టారిఫ్‌లను పెంచకతప్పడం లేదని టెలికాం ఇండస్ట్రీ వర్గాలు సూచనప్రాయంగా చెబుతున్నారు. అన్ని సంస్థలు ఇప్పటికే 4జీ సేవలను అందిస్తుండగా, వీటిలో కొన్ని సంస్థలు 5జీ సేవలను కూడా స్టార్ట్ చేశాయి. 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి నూతన టవర్లు, అలాగే స్పెక్ట్రం కొనుగోలు చేయడానికి వేలాది కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తున్నదని కంపెనీల వాదన. ఇదే సమయంలో రోజురోజుకు నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని, దీంతో చార్జీలు పెంచాల్సి రావచ్చునని విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈసారి మాత్రం అన్ని ప్లాన్లను ధరలు పెంచకపోవచ్చని, కేవలం ప్రారంభ, మధ్య, గరిష్ఠ స్థాయి ప్లాన్లను వడ్డించే అవకాశాలు మెండుగావున్నాయి. జూలై 2024లో టెలికాం సంస్థలు తమ టారిఫ్‌లను 11 శాతం నుంచి 23 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే.

**డాటా వినియోగంలో టాప్**

దేశవ్యాప్తంగా మొబైల్ డాటా వినియోగం భారీగా పుంజుకుంటున్నది. సరాసరిగా భారత్‌లో ఒక్కో వినియోగదారుడు నెలకు 27 జీబీల నుంచి 35 జీబీల వరకు డాటాను వినియోగిస్తున్నారు. డాటా వినియోగం విస్తృతమవుతుండటంతో టెలికాం సంస్థలు వీరికి నాణ్యమైన సర్వీసులు అందించడానికి భారీగా టవర్లను నెలకొల్పుతున్నాయి.




**చిన్న ప్లాన్లకు గుడ్‌బై**

ఇప్పటికే పలు టెలికాం సంస్థలు చిన్న స్థాయి ప్లాన్లకు గుడ్‌బై పలికాయి. ఎంట్రీ లెవల్ ప్యాక్‌లను ఎత్తివేయడంతోపాటు డాటా ప్యాక్‌లో కోత పెట్టాయి కూడా. గడిచిన కొన్ని నెలల క్రితం జియో, ఎయిర్‌టెల్ సంస్థలు రోజుకు 1జీబీ డాటా ప్యాక్‌ను ఎత్తివేసి..ఈ స్థానంలో 1.5 జీబీ డాటా ప్లాన్‌ను రూ.299తో ప్రారంభించింది. పాత ప్లాన్ చార్జీతో పోలిస్తే 17 శాతం పెంచింది. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 1జీబీ డాటా ప్లాన్ రూ.299ని కొనసాగించింది.

## సంచలనం..
# భారీ లక్ష్యాన్ని ఊదేసిన సౌతాఫ్రికా

భారత్-ఏ, సౌతాఫ్రికా-ఏ జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్ట్ సిరీస్ 1-1తో డ్రా అయ్యింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్-1లో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 417 పరుగుల భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. జోర్డన్ హెర్మన్ (91), లెసెగో సెనోక్వానే (77), జుబేర్ హంజా (77), టెంబా బవుమా (59), వికెట్ కీపర్ కాన్నర్ (52 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి సౌతాఫ్రికాను గెలిపించారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 255 పరుగులకు ఆలౌటైంది. ధృవ్ జురెల్ (132 నాటౌట్) అజేయ సెంచరీతో గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. అనంతరం సౌతాఫ్రికా కూడా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. టీమిండియా పేసర్ల ధాటి??కి 221 పరుగులకే ఆలౌటైంది. 34 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 7 వికెట్ల నష్టానికి 382 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.



జురెల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అజేయ సెంచరీతో (127 నాటౌట్) చెలరేగాడు. కెప్టెన్ రిషబ్ పంత్ (65), హర్ష్ దూబే (84) అర్ధ సెంచరీలతో రాణించారు. భారీ లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా బ్యాటర్లు సమిష్టిగా రాణించారు. ఐదుగురు అర్ధ సెంచరీలు చేసి సౌతాఫ్రికాను విజయతీరాలకు చేర్చారు. భారత బౌలర్లు పోరాడినప్పటికీ.. ఫలితం లేకుండా పోయింది. కాగా, ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్‌లో భారత్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల అనధికారిక వన్డే సిరీస్ నవంబర్ 13 నుంచి మొదలవుతుంది.

# టీమిండియాకు ఊహించని షాక్..

సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు ఊహించని షాక్ తగిలింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. బెంగళూరు వేదికగా సౌతాఫ్రికా-ఎతో జరుగుతున్న రెండో అనాధికారిక టెస్టులో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా జురెల్ కుడి చేతి వేలికి గాయమైంది. ప్రోటీస్ ఓపెనర్ లెసెగో సెనోక్వానే ఆఫ్ స్టంప్ వెలుపల డెలివరీని డ్రైవ్ ఆడాడు. ఈ క్రమంలో బంతి ఎడ్జ్ తీసుకుని థర్డ్ స్లిప్ దిశగా వెళ్లింది. ఈ క్రమంలో స్లిప్‌లో ఉన్న జురెల్ క్యాచ్‌ను అందుకోవడానికి ప్రయత్నించగా.. బంతి అతడి చేతి వేలికి బలంగా తాకింది. వెంటనే తీవ్రమైన నొప్పితో విల్లవిల్లాడు. కనీసం ఫిజియో రాకుండానే అతడు మైదానాన్ని వీడాడు. ఇప్పటివరకు తిరిగి అతడు ఫీల్డింగ్‌కు రాలేదు. జురెల్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ అనాధికారిక టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఈ యూపీ క్రికెటర్ సెంచరీలతో చెలరేగాడు. అంతకుముందు విండీస్ సిరీస్‌లోనూ శతక్కొట్టాడు. దీంతో సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టులో ఆడించాలని భారత జట్టు మెనెజ్‌మెంట్ నిర్ణయించకున్నట్లు తెలుస్తోంది. రెగ్యూలర్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ అందుబాటులో ఉన్నప్పటికి ధ్రువ్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా రంగంలోకి దింపనున్నట్లు సమాచారం. కానీ అంతలోనే జురెల్ గాయ పడడం టీమ్‌మెనెజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ఇక భారత్-సౌతాఫ్రికా ఎ జట్ల మధ్య రెండో టెస్టు డ్రా దిశగా సాగుతోంది. 417 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీలు 56 ఓవర్లు ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి



209 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా విజయానికి 45 ఓవర్లలో 208 పరుగులు కావాలి.

## స్పోర్ట్స్

### శాంసన్‌ను తీసుకొని జడేజాను ఇచ్చేయండి.. రాజస్థాన్ పంతం నెగ్గేనా..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ పంతొమ్మిదో సీజన్ రిటెన్షన్, వేలం తేదీలు సమీపిస్తున్నాయి. ఆక్షన్ లోపే ట్రేడ్ పద్ధతిన ఆటగాళ్లను మార్చుకునేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. పద్దెనిమిదో సీజన్ ముగిసినప్పటి నుంచి ప్రధానంగా సంజూ శాంసన్ గురించే చర్చ నడుస్తోంది. తనను వచ్చే సీజన్‌కు రీటైన్ చేసుకోవద్దని సంజూ చెప్పడంతో అతడిని ఇచ్చేసి మరొకరిని తీసుకునేందుకు జస్థాన్ రాయల్స్ యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు ఎంఎస్ ధోనీ వారసుడిగా సరైన కెప్టెన్ వేటలో ఉంది చెన్నై సూపర్ కింగ్స్. ట్రేడ్ డీల్‌కు రెఢీగా ఉన్న ఈ రెండు ఫ్రాంచైజీల మధ్య ఇటీవలే ప్రాథమిక చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గత నాలుగేళ్లుగా సారథిగా వ్యవహరిస్తున్న శాంసన్‌కు రాజస్థాన్ రాయల్స్ పద్దెనిమిదో సీజన్‌లో రూ.18 కోట్లు చెల్లించింది. మరో సీజన్ ఆడేందుకు అతడు ఆసక్తి చూపకపోవడంతో.. ట్రేడ్ పద్ధతిన వదిలించుకోవాలనుకుంటోంది రాజస్థాన్. అయితే.. అంతే ధర పలికే ఆటగాడి కోసం చూస్తున్న ఆ ఫ్రాంచైజీ సీఎస్కే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను అడుగుతోంది. కానీ, తమ జట్టు కీలక ఆటగాళ్లలో ఒకడైన జడ్డూను ఇచ్చేందుకు చెన్నై సుముఖంగా లేదు. జడేజా కాకుండా డెవాల్డ్ బ్రెవిస్‌ను అప్పగించేందుకు సీఎస్కే అంగీరిస్తున్నా తమకు మరొకరు కూడా కావాలని రాజస్థాన్ కోరుతోంది. పద్దెనిమిదో సీజన్ ఆఖర్లో సీఎస్కే జెర్సీతో అదరగొట్టిన ఈ సఫారీ కుర్రాడు ఇప్పుడు పెద్ద స్టార్ అయిపోయాడు. రాజస్థాన్ డిమాండ్ నేపథ్యంలో నవంబర్ 7న చెన్నై యాజమాన్యం, సీఈఓ, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీలు సమావేశం కానున్నారు. ఈ మీటింగ్ ముగిశాక రాజస్థాన్ ట్రేడ్ డీల్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.









# మహేశ్ బాబు కంటే ముందే ప్రియాంకా చోప్రా లుక్.. ఎస్ఎస్ఎంబీ 29పై మరో క్రేజీ టాక్..!

మహేశ్ బాబు గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో రాబోతున్న గ్లోబ్ ట్రోటర్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఆఫ్రికన్ అడ్వెంచరస్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ చేసిన పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. జక్కన్న టీం రామోజీఫిలింసిటీలో ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ శివారులోని రామోజీ ఫిలింసిటీలో నవంబర్ 15న సాయంత్రం 6 గంటల నుంచి గ్రాండ్ ఈవెంట్ షురూ కానుంది. ఈ నేపథ్యంలో టైటిల్ ఏమై ఉంటుంది.. మహేశ్ బాబు లుక్ ఎలా ఉండబోతుంది.. ఇంతకీ హీరో పాత్ర పేరేంటి..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు. తాజా సమాచారం ప్రకారం టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో టైటిల్‌తోపాటే మహేశ్ బాబు పోస్టర్ కూడా బయటకు రాబోతుందట.

నవంబర్ 11న ప్రియాంకా చోప్రా పోస్టర్..!

అయితే ఈ రెండింటి కంటే ముందే హీరోయిన్ ప్రియాంకా చోప్రా లుక్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని జోరుగా టాక్ నడుస్తోంది. తాజా కథనాల ప్రకారం నవంబర్ 11న ప్రియాంకా చోప్రా పోస్టర్, పాత్ర పేరు లాంచ్ చేయబోతుందట జక్కన్న టీం. ఈ క్రేజీ వార్తపై అధికారిక ప్రకటన ఏం రాకున్నా రాజమౌళి సరికొత్త స్ట్రాటజీతో ముందుకెళ్తున్నాడా..? అంటూ చర్చ నడుస్తోంది. ఇప్పటిదాకా ఏ సినిమా ఈవెంట్‌కు లేని విధంగా ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్ ప్లాట్‌ఫాంను 130 అడుగుల వెడల్పు, 100 అడుగుల ఎత్తులో ఉండే విధంగా నిర్మిస్తున్నారట. ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ చిత్రాన్ని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటిదాకా ఏ సినిమా ఈవెంట్‌కు లేని విధంగా ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్ ప్లాట్‌ఫాంను 130 అడుగుల వెడల్పు, 100 అడుగుల ఎత్తులో ఉండే విధంగా నిర్మిస్తున్నారట. ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ చిత్రాన్ని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# జయ కృష్ణ సినిమా.. నిర్మాత, దర్శకుడు ఎవరంటే..




ఘట్టమనేని కుటుంబం నుంచి మరో నటుడు చిత్రపరిశ్రమలోకి వస్తున్నారు. ఈమేరకు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని గ్రాండ్ లాంచ్ కానున్నారు. తన బాబాయి మహేష్ బాబు ఆశీస్సులతో తొలి సినిమాకు సిద్ధం అవుతున్నాడు. ఆర్ఎక్స్ 100, మంగళవరం చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్‌తో అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. గతంలో సూపర్ స్టార్ కృష్ణతో కల్ట్ బ్లాక్‌బస్టర్ అగ్ని పర్వతం చిత్రాన్ని నిర్మించి, తరువాత రాజకుమారుడుతో ప్రిన్స్ మహేష్ బాబును తెలుగు సినిమాకు పరిచయం చేసిన అశ్విని దత్, ఇప్పుడు ఘట్టమనేని నుంచి మరో వారసుడిని వెండితెరకు పరిచయం చేస్తున్నారు. అజయ్ భూపతితో కలిసి మూడవ తరం స్టార్ జయ కృష్ణ ఘట్టమనేనితో ఒక మంచి ప్రేమకథను అశ్విని దత్ నిర్మిస్తున్నారు. జయ కృష్ణ ఇప్పటికే నటనతో పాటు ఫైట్స్, డ్యాన్స్ వంటి ఇతర నైపుణ్యాలలో శిక్షణ పొందాడు. ఈ ప్రాజెక్ట్ ఇదే నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. టైటిల్ వంటి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. తెలుగు సినిమాలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఒక ప్రేమకథను ఈ మూవీలో చూపించనున్నట్లు తెలుస్తోంది. జయ కృష్ణ తండ్రి రమేశ్ బాబు అనారోగ్యం కారణంగా 2022లో కన్నుమూశారు. దీంతో ఆయన కుమారుడి కెరీర్‌ను చూడాల్సిన బాధ్యత మహేష్ బాబు మీద ఉంది.



# మార్ఫింగ్ ఫోటోలపై మండిపడ్డ అనుపమ పరమేశ్వరన్ .. నెటిజన్ల ప్రశంసల వర్షం

టీనేజ్‌లోనే హీరోయిన్‌గా సినిమాల్లో అడుగుపెట్టి తన సహజమైన అందం, అమాయకమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ మరోసారి చర్చకు కారణమైంది. 'ప్రేమమ్'తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తెలుగులో 'ఆ ఆ', 'శతమానం భవతి', 'హలో గురు ప్రేమ కోసమే', 'రాక్షసుడు', 'కార్తికేయ 2' వంటి హిట్ సినిమాల ద్వారా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ప్రముఖుల పేర్లతో ఫేక్ అకౌంట్లు సృష్టించి మోసాలు, దుష్ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ జాబితాలో అనుపమ కూడా చేరింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పేరుతో ఒక నకిలీ అకౌంట్ సృష్టించి, మార్ఫింగ్ ఫోటోలు షేర్ చేస్తూ, ఆమె స్నేహితులు మరియు కుటుంబ సభ్యులను ట్యాగ్ చేస్తూ అసభ్యకర కంటెంట్ పోస్టు చేయడం కలకలం రేపింది. దీనిపై స్పందించిన అనుపమ, కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో ఆ అకౌంట్ వెనుక తమిళనాడుకు చెందిన 20 ఏళ్ల యువతి ఉన్నట్లు బయటపడింది. ఈ విషయాన్ని స్వయంగా అనుపమ ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించింది. "కొన్ని రోజుల క్రితం నా పేరుతో మార్ఫింగ్ ఫోటోలు, తప్పుడు సమాచారం షేర్ చేస్తున్న ఒక అకౌంట్ కనిపించింది. అదే వ్యక్తి అనేక ఫేక్ అకౌంట్లు సృష్టించి నా మీద ద్వేష ప్రచారం చేసింది. సైబర్ పోలీసుల దర్యాప్తులో ఆమె తమిళనాడుకు చెందిన యువతి అని తెలిసింది. ఆమె వయసును దృష్టిలో ఉంచుకుని, నేను ఆమె గుర్తింపును బయటపెట్టను. కానీ చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయి. సెలబ్రిటీలకు కూడా సాధారణ పౌరుల్లాగే హక్కులు ఉన్నాయి. ఆన్‌లైన్ వేధింపులు శిక్షార్హ నేరం," అని అనుపమ పేర్కొంది. ఆమె ఈ హ్యూమన్ గెస్టర్‌పై నెటిజన్లు, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "అనుపమ చూపించిన సహనం, దయ అద్భుతం", "ఆమె నిజంగా ఒక క్లాస్ యాక్టర్ మాత్రమే కాదు, క్లాస్ హ్యూమన్ కూడా" అంటూ సోషల్ మీడియాలో అభినందనల వెల్లువ ఊరేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, అనుపమ తాజాగా 'బైసన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతకుముందు 'పరదా', 'కిష్కిందపురి' చిత్రాల్లో నటించి నటిగా తన వైవిధ్యాన్ని నిరూపించుకుంది. పాత్రల్లో నైపుణ్యం, స్క్రీన్ ప్రెజెన్స్, స్వచ్ఛమైన వ్యక్తిత్వం అన్నీ కలగలిపిన అనుపమ, సౌత్ సినీ ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా తన స్థానం మరింత బలపరుచుకుంటోంది.




# సుధీర్ బాబు కొత్త సినిమా వసూళ్లు ఎంత?

తెలుగులో ఈ వీకెండ్ చాలా సినిమాలు రిలీజయ్యాయి. రష్మిక 'గర్ల్‌ఫ్రెండ్'తో పాటు ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో, ప్రేమిస్తున్నా చిత్రాలతో పాటు ఆర్యన్, డీయస్ ఈరే లాంటి డబ్బింగ్ చిత్రాలు థియేటర్లలోకి వచ్చాయి. వీటన్నింటికి పాజిటివ్ టాక్ వచ్చింది. వీటితోనే రిలీజైన సుధీర్ బాబు 'జటాధర'కు మాత్రం తొలి షో నుంచే తెలుగు రాష్ట్రాల్లో నెగిటివ్ టాక్ వచ్చింది. కానీ ఈ సినిమా కలెక్షన్స్ మాత్రం షాకింగ్ అనిపిస్తున్నాయి. ఈ వారాంతం రిలీజైన సినిమాల్లో గర్ల్ ఫ్రెండ్, ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ చిత్రాలు ఉన్నంతలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. జనాలు థియేటర్లకు వస్తున్నారు గానీ వీటికి చెప్పుకోదగ్గ వసూళ్లు రావట్లేదా అనిపిస్తుంది. ఎందుకంటే మేకర్స్ వైపు నుంచి ఎలాంటి పోస్టర్స్ బయటకు రాలేదు. మరోవైపు తెలుగు-హిందీలో రిలీజైన 'జటాధర' టీమ్ మాత్రం కలెక్షన్స్ పోస్టర్స్ రిలీజ్ చేస్తున్నారు. తొలిరోజు రూ. 1.47 కోట్ల గ్రాస్ సాధించగా.. రెండు రోజులకు కలిపి రూ. 2.91 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు అధికారికంగా ప్రకటించారు. పాజిటివ్ టాక్ ఏ మాత్రం రాని 'జటాధర'కు ఈ రేంజు వసూళ్లు రావడం అంటే ఓ రకంగా షాకింగ్ అని చెప్పొచ్చు. వీకెండ్ పూర్తయ్యేసరికి మరి ఏ మూవీ రేసులో ముందు ఉంటుందో చూడాలి? 'జటాధర' విషయానికొస్తే.. రుద్రారం అనే ఊరిలోని ఓ ఇంట్లో దాచిన లంకె బిందెలకు ఓ ధన పిశాచి (సోనాక్షి సిన్హా) కాపలా ఉంటుంది. ఓసారి బంధనానికి విఘాతం కలిగి ధనపిశాచి రక్తాన్ని మరుగుతుంది. దీంతో ఊరంతా ఖాళీ అయిపోతుంది.. మరోవైపు శివ(సుధీర్ బాబు) అనే ఘోస్ట్ హంటర్.. సైంటిఫిక్‌గా దెయ్యాలు లేవని నిరూపిస్తూ ఉంటాడు. శివకు తరుచుగా ఓ బాబుని అతడి తల్లి చంపుతున్నట్లు పీడకల వస్తూ ఉంటుంది. ఈ పీడకలకు, ధనపిశాచికి, శివకు మధ్య సంబంధమేంటి? అనేది మిగతా స్టోరీ.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.